- బాచుపల్లి బైరోని లేక్ఐడి నెం.2821 (పెద్దకుంట)చెరువులో అక్రమ నిర్మాణం..
- గ్రామపంచాయతీ పర్మిషన్ పేరిట 'రాయల్ ఓక్' కమర్షియల్ కాంప్లెక్స్ అక్రమం..
- మూడు శాఖల నిర్లక్ష్యం అంటూ 'పెన్ పవర్' దినపత్రికలో పలుమార్లు వార్తా కథనాలు..
- స్పందించిన నిజాంపేట్ సర్కిల్-58 అధికారులు, మంగళవారం సీల్ వేశారు..
- షోకాజ్ నోటీసులు జారీ, (హియరింగ్) విచారణ జరిపిన అధికారులు..
- ఏప్రిల్ 13న స్పీకింగ్ ఆర్డర్ జారీచేసి.. మంగళవారం 'రాయల్ ఓక్' సీజ్..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# చెరువులో 'రాయల్ ఓక్' సీజ్




## 'పెన్ పవర్' వరుస కథనాలపై స్పందించిన నిజాంపేట్ సర్కిల్-58 టౌన్‌ప్లానింగ్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 21: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్-58 అధికారులు స్పందించారు.. బాచుపల్లి చెరువులో "రాయల్ ఓక్" కమర్షియల్ కాంప్లెక్స్ భవనంపై "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు, టౌన్‌ప్లానింగ్ అధికారులు సంబంధిత అక్రమ భవనాన్ని, అధికారికంగా సీజ్ చేశారు.. బాచుపల్లి గ్రామ శివారు సర్వే నెంబర్ 64లో ఉన్న పెద్దకుంట లేక్ఐడి నెంబర్ 2821 చెరువు(బైరోని) (బిన్) చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమణతో నిర్మాణం.. గ్రామ పంచాయతీ అనుమతుల పేరిట, మున్సిపల్ చట్టాలకు తిలోదకాలు అంటూ పలుమార్లు, పెన్ పవర్, దినపత్రికలో వచ్చిన ప్రత్యేక కథనాలకు అధికారులు స్పందించారు.. అక్రమ కమర్షియల్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని.. మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలతో మంగళవారం 'రాయల్ ఓక్' బిల్డింగ్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది సీల్ వేశారు..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్











### చట్టపరంగా విచారణ జరిపి సీజ్..

నిజాంపేట్ సర్కిల్-58 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, బాచుపల్లి బైరోని చెరువులో అనధికారికంగా నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు.. సంబంధిత నిర్మాణంపై టౌన్‌ప్లానింగ్ చర్యల్లో భాగంగా.. నోటీస్ నెంబర్. 100/UC/TPS/ W.273/C58/ CMC/2026 ద్వారా, 12 మార్చి 2026న షోకాజ్ నోటీసు జారీ చేశారు.. అనంతరం 13 ఏప్రిల్ 2026న స్పీకింగ్ ఆర్డర్స్ జారీచేసినట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం చర్యల్లో భాగంగా సీజ్ చేసిన వివరాలను ఈ విధంగా తెలియజేశారు.. బాచుపల్లి గ్రామంలోని బైరుని చెరువు(లేక్ఐడి నెం.2821) వద్ద సర్వే నెంబర్ 64లో ఉన్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు పరిశీలించారు.. ఆ నిర్మాణంపై 12-03-2026న (ఎందుకు కూల్చకూడదో చెప్పమని)షోకాజ్ నోటీసు ఇచ్చారు.. తర్వాత 17-03-2026న విచారణ (హియరింగ్) నిర్వహించారు..ఏప్రిల్ 13న స్పీకింగ్ ఆర్డర్స్ ఉండగా, పనులు చేస్తున్నారని, మంగళవారం సీజ్ చేసినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు "పెన్ పవర్" ప్రతినిధితో తెలిపారు.




బాచుపల్లిలో పెద్దకుంట చెరువు.. (బిన్ చెరువు-బైరోని చెరువు.. కెడస్టల్ మ్యాప్..




బాచుపల్లి బైరోని చెరువులో 'రాయల్ ఓక్' నిర్మాణం సీజ్ చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## దుండిగల్ సర్కిల్‌లో..! ఏం జరుగుతోంది సార్లూ..?

- నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు..! అయినా నిర్మాణం పూర్తి..?
- విధుల్లో ఉన్నది ప్రభుత్వ అధికారులేనా..? అక్రమ నిర్మాణాల ప్రోత్సాహకులా..?
- ఇది మారదా..? ఇంతే సంగతులా..?




-4 లో

## అక్రమ నిర్మాణాలపై.. రెవెన్యూ కొరడా..




- గాజులరామారం సర్వే నెంబర్ 49 ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు..
- కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం.49/6 దిల్ సంస్థకు కేటాయింపు.
- 2011లో దిల్ నిర్మాణ సంస్థకు 11-30 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది..
- ఆర్డీవో ఆదేశాలతో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ నిర్మాణాలు పరిశీలన..
- నివేదిక ఆధారంగా మల్కాజిగిరి ఆర్డీవో కూల్చివేతలకు ఆదేశాలు..
- నివేదిక ఆధారంగా మల్కాజిగిరి ఆర్డీవో కూల్చివేతలకు ఆదేశాలు..
- సంబంధిత భూమిలో వెలిసిన 15 అక్రమ నిర్మాణాలు మంగళవారం నేలమట్టం..!

-5 లో




దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధిలోని నర్సాపూర్ హైవేపై తాజా హోటల్ పక్కన అక్రమ నిర్మాణం సీజ్.. ఫైల్‌ఫొటో..

నోటీసులు-సీజింగ్‌లు కూల్చివేతలు బేఖాతర్ చేస్తూ.. నిర్మాణం పూర్తి..

# దుండిగల్ సర్కిల్‌లో..! ఏం జరుగుతోంది సార్లూ..?

- నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు..! అయినా నిర్మాణం పూర్తి..?
- విధుల్లో ఉన్నది ప్రభుత్వ అధికారులేనా..? అక్రమ నిర్మాణాల ప్రోత్సాహకులా..?
- ఇది మారదా..? ఇంతే సంగతులా..?


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
కప్పం కడితే..! కూల్చింది కట్టుకోవచ్చు..!


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
DUNDIGAL CIRCLE
పెన్ పవర్
తెలంగాణ రౌండప్
'కమిషనర్-ఏసిపి' సార్..! కూల్చినవి కట్టేదేంది..?


2026 మార్చి 26న దుండిగల్ ఏసిపి ఆధ్వర్యంలో కూల్చివేతల చిత్రం..



మార్చి 30 వరకు కూల్చిన రంధ్రాలు నిర్మాణం పూర్తి..

దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 21: దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగం పని తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామనే సాకుతో..! ఒకవైపు తూతూ మంత్రంగా కూల్చివేతలు..! మరోవైపు సంబంధిత అక్రమ నిర్మాణాలు దర్జాగా పూర్తిచేయడాన్ని చర్యలు అంటారా..? సహకరించడం అంటారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. 200 ఫీట్ల వెడల్పుతో ఉన్న నర్సాపూర్ రహదారిపై, కమర్షియల్ పర్మిషన్‌లకు బదులు..! "స్టిల్ట్‌ం2" రెసిడెన్షియల్ అనుమతులు మంజూరు చేయడం ఒకవంతైతే..! సంబంధిత నిర్మాణ దారుడు అక్రమ సెల్లార్, సెట్‌బ్యాకులు జీరో, అదనంగా 3 అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం గమనార్హం.. "టిజి-బిపాస్- బిల్డ్‌నవ్" చట్టప్రకారం పర్మిషన్‌లో నిబంధనలు సూచించినప్పటికీ..! అక్రమార్కులు బరితెగించి నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తుంటే..! చేతులు ముడుచుకుని చోద్యంచూసి టౌన్‌ప్లానింగ్ అధికారులు.. 2026 జనవరి 28న దుండిగల్ ఏసిపి శ్రీనివాస్ అట్టహాసంగా చైన్‌మెన్‌లతో వెళ్ళి సీజ్ చేశారు.. అయినప్పటికీ యధావిధిగా పనులు చేస్తున్నారనే ఫిర్యాదులతో, 2026 మార్చి 26న ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జేసిబితో కూల్చివేతలు జరిపారు..

## నిర్మాణం పూర్తి చేసింద్రు..

టౌన్‌ప్లానింగ్ అధికారుల చేష్టలు "కరప్షన్‌కి ఎక్కువ విధులకి తక్కువ" అన్నట్టు తయారైంది.. "నోటీసులు-సీజింగ్‌లు-కూల్చివేతలు" ముగించారు.. చివరికి చర్యలు మొత్తం ఉత్తుత్తివేనని నిరూపణ అయింది.. టిజి-బిపాస్- బిల్డ్‌నవ్ చట్టాలను, దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులే అపహాస్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. అక్రమంగా సెల్లార్‌తో, స్టిల్ట్‌ం4 అంతస్తులతో నిర్మాణన్ని దాదాపు పూర్తి చేశారు.. టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపి తీసుకున్న చర్యలేవి..? కూల్చేసిన ఆనవాళ్ళు కనిపించవేమి..? నిబంధనల ఉల్లంఘనపై దుండిగల్ సర్కిల్-59 సార్లు ఏం చేశారు..? సెల్లార్ మూసేశారా..? అదనపు అంతస్తులు కూల్చేశారా..? పార్కింగ్ కేటాయించిన స్థలంలో కమర్షియల్ షట్టర్‌లు ఎలా నిర్మించారు..? రెసిడెన్షియల్ పర్మిషన్‌తో నిర్మించిన భవన నిర్మాణం కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చడానికి, అధికారులు అక్రమార్కులకు అమ్ముడు పోయారా..? అన్న ప్రశ్నలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి.

## కూల్చింది కట్టుడేంది..?

ప్లనింగ్ అధికారులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ.. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణ దారులకు అమ్ముడు పోతున్నారా..? అనిపించే విధంగా వ్యవహరిస్తున్నారు.. నర్సాపూర్ హైవేపై తాజా హెటల్ పక్కన టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన అక్రమ నిర్మాణంలో యధావిధిగా పనులు చేస్తుండగా..! గతనెల మార్చి 26న ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాక్షికంగా కూల్చివేశారు.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారికంగా కూల్చివేసిన అక్రమ నిర్మాణాలకు విలువలేదని నాలుగు రోజుల్లో తేటతెల్లం అయింది.. మార్చి 30 నాటికి మళ్లీ నిర్మించటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది..

- కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెం.49/6 దిల్ సంస్థకు కేటాయింపు.
- 2011లో దిల్ నిర్మాణ సంస్థకు 11-30 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది..
- ఆర్డీవో ఆదేశాలతో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ నిర్మాణాలు పరిశీలన..
- నివేదిక ఆధారంగా మల్కాజిగిరి ఆర్డీవో కూల్చివేతలకు ఆదేశాలు..
- సంబంధిత భూమిలో వెలిసిన 15 అక్రమ నిర్మాణాలు మంగళవారం నేలమట్టం..!

కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెం.49/6 లో రెవెన్యూ కూల్చివేతలు..




# అక్రమ నిర్మాణాలపై... రెవెన్యూ కొరడా

## గాజులరామారం సర్వే నెంబర్ 49 ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు..




కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఏప్రిల్ 21: కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం గ్రామ శివారు ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై మంగళవారం రెవెన్యూ అధికారులు పంజా విసిరారు..మల్కాజిగిరి ఆర్డీవో ఆదేశాల మేరకు, సూరారం సాయిబాబా నగర్ చౌరస్తా సమీపంలో ఉన్న, సర్వే నెంబర్ 49 ప్రభుత్వ భూమిలో వెలసిన 15 అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు కుత్బుల్లాపూర్ మండలం, ఇన్‌చార్జ్ తహశీల్దార్(డిప్యూటీ ఎమ్మార్వో) సుధాకర్ మంగళవారం ఈ కూల్చివేతలు చేపట్టారు.. ప్రభుత్వ భూమిలో నిర్మించిన 15 ఇళ్లను జేసీబీలు, ఇటాచ్చీలతో నేలమట్టం చేశారు.. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహశీల్దార్ (డి.టి) సుధాకర్ మాట్లాడుతూ.. గాజులరామారం సర్వే నెంబర్ 49/6 ప్రభుత్వ భూమిని 2011 సంవత్సరంలో సుమారు 11-30 ఎకరాలు, దిల్ నిర్మాణ సంస్థకు ప్రభుత్వం కేటాయించినట్లు సుధాకర్ తెలిపారు.. దీంతో కబ్జాదారులు ప్లాట్‌లు చేసి, అక్రమంగా గదులు నిర్మించి, అమాయకులకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు అందాయి..

## ఆర్డీవో ఆదేశాలతో పరిశీలించి కూల్చివేతలు..

దిల్ సంస్థకు కేటాయించిన భూమిలో అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదులతో, కుత్బుల్లాపూర్ మండలం రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్డీవో స్పష్టమైన ఆదేశాల మేరకు ఆర్ఐ ఖలీం ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి సూరారం సాయిబాబా నగర్‌లోని, సర్వే నెంబర్ 49/6 లో నిర్మించిన 15 అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు.. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగర్త చర్యల్లో భాగంగా, పోలీస్ భద్రతతో కూల్చివేతలు నిర్వహించారు.

పోలీస్ భద్రతతో రెవెన్యూ కూల్చివేతలు..






# రేవంత్‌రెడ్డికి గవర్నర్ మద్దతు ఎంత



**హైదరాబాద్, ఏప్రిల్ 21, పెన్ పవర్:** తెలంగాణ మంత్రి అజరుద్దీన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్ ఈ నెల 30 లోగా ఏదైనా చట్టసభలో సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అలాకాని పక్షంలో ఆయన మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మంత్రి అజారుద్దీన్ తోపాటు ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన ఫైల్ ను ఆమోదించాలని కోరారు. ప్రధానంగా మంత్రి అజారుద్దీన్ ను నామినేట్ చేసే అంశంపైనే సీఎం దృష్టిపెట్టారని చెబుతున్నారు.సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ లు యథాతథంగా ఆమోదిస్తారు. కానీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం పెండింగ్ లో పడిపోయినట్లు చెబుతున్నారు. మంత్రి అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ గత ఏడాది అక్టోబరు 28న తెలంగాణ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆమోదించాల్సిందిగా గవర్నర్ కు సిఫార్సు చేసింది. ఇక ఆ నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ప్రభుత్వం సిఫార్సు చేయడంతో అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. అజారుద్దీన్ మంత్రిగా ఉన్న సమయంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉండగా, తర్వాత ఆయన బదిలీ అయ్యారు. కొత్త గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా వచ్చారు. ఈ కారణంగా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకం పెండింగులో ఉండిపోయినట్లు చెబుతున్నారు. అయితే ప్రొఫెసర్ కోదండరాంకు సంబంధించి న్యాయవివాదం ఉండటంతోనే గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో అజారుద్దీన్ పేరును సైతం ఆమోదిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గవర్నర్ ఆమోదం లభించకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే గవర్నర్ నిర్ణయమేంటో మాత్రం తెలియలేదు. దీంతో అజ్జూభాయ్ మంత్రి పదవిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. గవర్నర్ కోటాలో శాసన మండలికి పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి పట్టుబడుతున్న వారిలో ప్రొఫెసర్ కోదండరాం.. సహా.. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అజారుద్దీన్ ఉన్నారు. వీరిలో అజారుద్దీన్ పరిస్థితి అత్యంత ముఖ్యంగా మారింది. ఆయన ఇప్పటికే ఆరు మాసాలుగా మంత్రిగా ఉన్నారు. కానీ, ఏ సభలోనూ ఆయన ప్రాతినిధ్యం లేదు. ఈ నెల 30 లోటా అంటే.. కేవలం 11 రోజుల్లోనే ఆయనను మండలికి సిఫార్సు చేయాల్సి ఉంది. అలా చేయకపోతే.. మంత్రిపదవిని సైతం ఆయన కోల్పోవడం ఖాయం. ఇక, కోదండరాంను ఇప్పటికే గతంలో గవర్నర్ కోటా కింద సిఫార్సు చేసినా.. అది ఫలించలేదు. ఉద్యమ నాయకుడిగా పేరుతెచ్చుకున్న కోదండరాంను సభకు పంపించడం ద్వారా.. రాజకీయ మైలేజీ ఉంటుందని రేవంత్ ఆశలు పెట్టుకున్నారు. ఈ ఇద్దరిని గవర్నర్ కోటాలోనే మండలికి పంపించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో.. కేంద్రం చెప్పుచేతల్లోనే గవర్నర్‌లు పనిచేస్తున్న కారణంగా.. రేవంత్ ఆశలు ఫలిస్తాయా? అనేది ప్రశ్న. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు



**హైదరాబాద్, ఏప్రిల్ 21 పెన్ పవర్:** తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వ లెక్కల్లో రూ. 20 లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగినప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదించారు. ఎస్ఎఫ్‌టీకి రూ. 7 వేలు ఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# గులాబీ గూటికి ప్రీతిరెడ్డి...




**హైదరాబాద్, ఏప్రిల్ 21, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అనూహ్య మలుపులకు వేదికవుతూనే ఉంటాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం అటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ.. ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ పెను చర్చకు దారితీసింది. మల్లారెడ్డి వంటి సీనియర్ నేత.. అదీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యే, నేరుగా ప్రధానిని కలవడం వెనుక ఉన్న రాజకీయ గూఢార్థాలు ఇప్పుడు విశ్లేషణలకు పని పెడుతున్నాయి వారసత్వ రాజకీయాల కొత్త అడుగు ఈ భేటీలో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డిని వెంట తీసుకెళ్లడం.. సాధారణంగా రాజకీయ నాయకులు తమ వారసులను జాతీయ స్థాయి నేతలకు పరిచయం చేస్తున్నారంటే.. అది భవిష్యత్తు ప్రాతినిధ్యానికి పునాది అని అర్థం. గత కొంతకాలంగా ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే తన కోరికను ఆమె గతంలోనే బహిరంగ పరిచారు. ఇప్పుడు ప్రధాని మోదీతో భేటీ ద్వారా.. ఆమెను బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపే దిశగా మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది.

పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. మల్లారెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో బలమైన ఆర్థిక, సామాజిక పట్టు ఉంది. ఆయన వంటి నేత పార్టీని వీడితే అది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అయితే బీఆర్ఎస్ శ్రేణులు దీనిని "మర్యాదపూర్వక భేటీ"గా అభివర్ణిస్తున్నప్పటికీ రాజకీయాల్లో 'అకస్మాత్తు మర్యాదలు' ఉండవనేది జగమెరిగిన సత్యం. మరోవైపు తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి మల్లారెడ్డి వంటి 'మాస్' ఇమేజ్ ఉన్న నేతలు అవసరం. ఆర్థిక వనరులు, విద్యాసంస్థల నెట్‌వర్క్ ఉన్న మల్లారెడ్డి కుటుంబం బీజేపీలోకి వస్తే, అది పార్టీకి అదనపు బలాన్ని ఇస్తుంది. బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి గతంలో జరిపిన భేటీని, ఇప్పటి మోదీ భేటీని కలిపి చూస్తే.. మల్లారెడ్డి కుటుంబం కమల తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైనట్లే కనిపిస్తోంది. . కేవలం ప్రయోజనాలు మాత్రమే ఉంటాయన్న నానుడి మల్లారెడ్డి విషయంలో మరోసారి రుజువయ్యేలా ఉంది. ఒకవేళ మల్లారెడ్డి బీజేపీ గూటికి చేరితే, అది తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. తన రాజకీయ వారసురాలిగా కోడలు ప్రీతిరెడ్డిని ఢిల్లీ పీఠం వైపు నడిపించేందుకు మల్లారెడ్డి వేసిన ఈ 'మాస్టర్ ప్లాన్' ఎంతవరకు పారుతుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా ఈ భేటీ బీఆర్ఎస్ శిబిరంలో ఆందోళనను, బీజేపీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో వెలువడే అధికారిక ప్రకటనలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించవచ్చు.

## మునగాల యాదమ్మకు నివాళులర్పించిన

# భూక్యా సురేష్ నాయక్

### అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయం





**ఖమ్మం రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 21:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 30వ వార్డు మదర్ థెరిస్సా కాలనీకి చెందిన మునగాల యాదమ్మ మంగళవారం మరణించారు. విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ధ్వారా తెలుసుకొని యాదమ్మ నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహం వద్ద ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపి ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం తన సొంత నిధుల నుండి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గుర్రం రాకేష్ రెడ్డి, గిజ్జన్, మల్లేష్, భద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై ప్రేమను చాటుకున్న చిన్నారి

**జగిత్యాల: పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఓ చిన్నారి తన ప్రేమను చాటుకుంది. సోమవారం నాడు జరిగిన జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభ అనంతరం బస్సులో వెళ్తుండగా కేసీఆర్ చిత్రపటాన్ని పట్టుకొని చిన్నారి తండ్రి భూజాలపై కూర్చుని కనిపించింది. చిన్నారిని చూసిప కేసీఆర్ బస్సు ఆపి చిత్రపటాన్ని స్వీకరించి, చిన్నారిని చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించారు.

## 3 బీహెచ్‌కే కంప్లల్సరీ అంటున్న హైదరాబాదీలు..

**హైదరాబాద్, ఏప్రిల్ 21, పెన్ పవర్:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు 'సొంత ఇల్లు' అంటే 2 బీహెచ్‌కే అనేది మధ్య తరగతి కలగా ఉండేది, కానీ ఇప్పుడు ఆ

ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కేవలం తల దాచుకోవడానికే కాకుండా, ఇంటిని ఒక ఆఫీసుగా, వినోద కేంద్రంగా మార్చుకోవాలనే తపన హైదరాబాద్ వాసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 4బీహెచ్‌కే లే హాట్ కేకులు! హైదరాబాద్ మహానగరం ఇప్పుడు కేవలం ఐటీ హబ్‌గానే కాదు.., లగ్జరీ రియల్ ఎస్టేట్ రాజధానిగా కూడా అవతరిస్తోంది. గతంలో ఇల్లు అంటే కేవలం బెడ్రూంలు, హాల్ మాత్రమేఅనుకునే వారు, కానీ కొవిడ్ తర్వాత మారిన జీవనశైలి ప్రజల ప్రాధాన్యతలను పూర్తిగా మార్చేసింది. నేడు కొనుగోలుదారులు చిన్న ఇళ్ల కంటే విశాలమైన 3బీహెచ్‌కే లేదంటే 4బీహెచ్‌కే ఫ్లాట్ల వైపునకేమొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కోకాపేట నుంచి తెల్లాపూర్ వరకు ఆకాశహర్మ్యాలు వెలుస్తూ, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈ మార్పు రావడానికి ప్రధానకారణం 'వర్క్ ఫ్రమ్ హోమ్' లేదా 'హైబ్రిడ్ వర్కింగ్' మోడల్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కార్పొరేట్ ఉద్యోగులు రోజుకు కనీసం 8 నుంచి10 గంటలు ఇంటి నుంచే పని చేయాల్సి వస్తోంది. దీంతోబెడ్రూమ్‌లో కూర్చొని పని చేయడం కంటే, ఏకాంతంగా ఉండే ఒక ప్రత్యేకమైన ఆఫీస్ గది అవసరమని భావిస్తున్నారు. అందుకే 2బీహెచ్‌కే లో సరిపెట్టుకోకుండా, అదనంగా ఒక గది ఉండేలా 3బీహెచ్‌కే లేదా4బీహెచ్‌కే కావాలని కోరుకుంటున్నారు. ఆ నాలుగో గదిని ఆఫీసుగానో, లైబ్రరీగానో లేదా కిడ్స్ ప్లే ఏరియాగానో వాడుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని పడమర (భాగం ఇప్పుడు లగ్జరీ నిర్మాణాలకు

చిరునామాగా మారింది. కోకాపేట, నార్సింగి, తెల్లాపూర్, గండిపేట వంటి ప్రాంతాల్లో చదరపు అడుగు ధర ?9,000 నుంచి ?15,000 వరకు ఉన్నప్పటికీ, డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు.కోకాపేటలో వెలుస్తున్న నియోపోలిస్ వంటి అత్యాధునిక లేఅవుట్లు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో క్లబ్ హౌస్‌లు, ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్స్,విశాలమైన బాల్కనీలు, గ్రీన్ జోన్స్ ఉండడం సంపన్న వర్గాలను, సీనియర్ ఐటీ ప్రొఫెషనల్స్‌ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ప్రజలు ఇల్లు కొనేటప్పుడు కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా, రాబోయే 10-15 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి మళ్లీ కొంత మేర పెరుగుతుండడం లేదా తల్లిదండ్రులు, అతిథులు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలని పెద్దఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. చిన్న ఇళ్ల కంటే పెద్ద లగ్జరీ ఇళ్లకు భవిష్యత్తులో రీసేల్ వాల్యూ ఎక్కువగా ఉంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం, 2026చివరి నాటికి హైదరాబాద్‌లో అమ్ముడయ్యే మొత్తం ఫ్లాట్లలో 60 శాతానికి పైగా 3బీహెచ్‌కే , అంతకంటే పెద్దవే ఉండే అవకాశం ఉంది. ఇది హైదరాబాద్‌ను ముంబై, బెంగళూరు వంటి నగరాల కంటే ఖరీదైనమార్కెట్‌గా మారుస్తోంది. కేవలం మధ్యతరగతి మార్కెట్ నుండి 'ప్రీమియం మార్కెట్' వైపు హైదరాబాద్ అడుగులు వేస్తోంది. ఈ లగ్జరీ ట్రెండ్ నగర ప్రతిష్టను పెంచుతున్నప్పటికీ, సామాన్యుడికి మాత్రంగగణం అవుతోంది. భూముల ధరలు పెరగడంతో బిల్డర్లు కూడా చిన్న ఇళ్ల కంటే లాభాలు ఎక్కువగా వచ్చే పెద్ద ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ?50-60 లక్షల బడ్జెట్‌లో ఇల్లు దొరకడంఅనేది ఇప్పుడు హైదరాబాద్‌లో అసాధ్యంగా మారిపోయింది. ఏదేమైనా, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇప్పుడు తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకుంది.

## వముచ్చింతల్ క్షేత్రంలో గుబాళిస్తున్న ఆద్యాత్మిక పరిమళాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముచ్చింతల్ లో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి నాలుగేళ్లు దాటింది. ఈ విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 5 ఫిబ్రవరి 2022న వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆవిష్కరించి జాతికి అంకితం ఇచ్చారు. గత నాలుగేళ్లుగా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు.రాజా ఆదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, – బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు – గొప్ప వని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజా చార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, – సాటిలేని భక్తి తత్పరునిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించే నాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హట్నయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వక్రతు కేశవ సోమయాజి దీక్షితార్, కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం 1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు రామానుజులు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ లో 45 ఎకరాల విస్తీర్ణంలో పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సత్ సంకల్పంతో దివ్య క్షేత్ర పనులు 2016లో ప్రారంభ మయ్యాయి. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.1000 కోట్లతో పనులు జరిగాయి. పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, విజయనగర నిర్మాణ శైలులను కలగలిపి వివిధ 2700 మంది శిల్పుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టగా, ప్రధానంగా.. సమతామూర్తి 216 అడుగుల, 1800 కిలోల బరువు గల మహా పంచలోహ విగ్రహాన్ని 1600 భాగాలుగా తొమ్మిది నెలల కఠోర శ్రమ తో చైనాలో తయారు చేయించారు. మన దేశానికి తెచ్చాక చైనాకు చెందిన 60 మంది నిపుణులు విగ్రహ రూపునిచ్చారు. వెయ్యేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సమతామూర్తి మహా విగ్రహం చుట్టూ శ్రీవైష్ణవంలో దివ్యదేశాలుగా భావించే 108 పుణ్య క్షేత్రాలు, గర్భాలయాల ఆకృతిలో 108 ఆలయాలను నిర్మించారు. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో 468 స్తంభాలతో భారీ దివ్యదేశ మండపాన్ని నిర్మించారు. సమతామూర్తి విగ్రహ దిగువ న భద్రవేదిక 54 అడుగులు, పద్మ పీఠం 27 అడుగులు, శ్రీరామాను జాచార్యుల విగ్రహం 108 అడుగులు, స్వామి చేతిలోని త్రిదండం 27 అడుగుల ఎత్తు ఉన్నాయి. మహా విగ్రహం కింద విశాలంగా ఉన్న గర్భగుడిలో 120 కిలోల బంగారు విగ్రహ రూపంలో రామానుజులు నిత్యపూజామూర్తిగా దర్శనం ఇస్తారు. అలా వెయ్యేళ్ల క్రితం భారతావనిలో నడయాడిన సమతా మూర్తి జగద్గురు శ్రీరామానుజాచార్యులు భక్తులకు నిత్య దర్శనం ఇస్తున్నారు.2022 ఫిబ్రవరి 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా ఈ సమతా మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం నాలుగేళ్లు దాటాయి. రామానుజులవారి బ్రహ్మోత్సవాలు సమతా కుంభ్ 2023 పేరుతో ఆధ్యాత్మిక పండగను 10 రోజుల పాటు నిర్వహించారు. సమతా కుంభ్ 2023 సువర్ణమూర్తి భగవద్రామానుజుల వారికి స్నపనం మహోత్సవంతో, శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియర్ స్వామి ఆధ్వర్యంలో విశ్వక్సేనుడి ఆరాధనాతో ప్రారంభమై, ఫిబ్రవరి 12న చివరి రోజు ఉదయం ఉత్సవాన్త స్నపనము, సాయంత్రం మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ తో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్ 2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక గురువు త్రిదండి శ్రీశ్రీశ్రీ రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగాయి.అశేష భక్త జనం కార్యక్రమాలలో పాల్గొని తరించారు. గత నాలుగేళ్లు గా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు.

## కాంగ్రెస్ సీఎం.. ఎన్డీఏ నేతలతో స్నేహం

**హైదరాబాద్, ఏప్రిల్ 21, పెన్ పవర్:** జాతీయ రాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెంటర్ ఆఫ్ ద అట్రాక్షన్ గా నిలుస్తున్నారు. ఎన్డీఏ నేతలతో ఆయన నెరుపుతున్న స్నేహం జాతీయ మీడియాను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రధానంగా కేంద్రం తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లుపై తొలి నుంచి తీవ్ర వ్యతిరేక స్వరం వినిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర దక్షిణాది సీఎంలను కార్యోన్ముఖులు చేశారని అంటున్నారు. దీంతో అటు కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా రేవంత్ రెడ్డికి ప్రాధాన్యం పెరిగింది. ఇలాంటి మయంలో ఆయన ఎన్డీఏ నేతల విందు భేటీకి హాజరై తనదైన రాజకీయాన్ని ఆవిష్కరించారనే చర్చకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం జాతీయ రాజకీయ పరిణామాలు గమనిస్తే అధికార ఎన్డీఏ కూటమి, విపక్ష ఇండియా కూటమికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఎన్డీఏ కూటమి నేతలు నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ భేటీకి హాజరుకావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. మహిళా బిల్లు ఓడిపోయిన కారణంగా అటు బీజేపీ పెద్దలు, ఇటు కాంగ్రెస్ నేతలు తదుపరి వ్యూహంపై సమాలోచనలు చేస్తున్న సమయంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎన్డీఏ ఎంపీలు, ఇతర నేతలతో సరదాగా గడపడమే హాట్ టాపిక్ అవుతోంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. శుక్రవారం మహిళా బిల్లుపై ఓటింగ్ నిర్వహించిన కారణంగా ఆయన దేశ రాజధానిలో ఉండి విపక్షాన్ని సంఘటితం చేయడంపైనే దృష్టి పెట్టారు. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించి తమ మాట నెగ్గించుకున్నామని సంబరాలు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన శనివారం ఉదయం ఏపీకి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇంటికి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది ఎంపీలకు కేంద్ర మంత్రి విందు ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమానికి మంత్రులు రామ్మోహననాయుడు, కుమారస్వామి హాజరయ్యారు. అదేవిధంగా ఏపీకి చెందిన పలువురు టీడీపీ సీనియర్లు వెళ్లారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా వారిని కలిసేందుకు మంత్రి శ్రీనివాసవర్మ నివాసానికి వెళ్లారని అంటున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణకు చెందిన బీజేపీ నేత లక్ష్మణ్ కూడా హాజరయ్యారు. అంతా కలిసి సరదాగా మాట్లాడుకున్నారు. రాజకీయానికి అతీతంగా జరిగిన ఈ కార్యక్రమానికి చెందిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విభిన్న రాజకీయ వేదికల్లో ఉన్న ముఖ్య నేతలు ఒక చోట కలుసుకోవడం, సరదాగా నవ్వుతో మాట్లాడుకోవడం అరుదైన సంఘటనగా వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం రేవంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడమే కాకుండా జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యత పెరగడంతో ఈ కార్యక్రమం కూడా అందరి దృష్టిని ఆకర్షించిందని చెబుతున్నారు.

## ధనిక రాష్ట్రం.. పేద ప్రజలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రం దేశంలో తలసరి ఆదాయం, జీడీపీ పెరుగుదల పరంగా అగ్రస్థానంలో నిలుస్తోంది. హైదరాబాద్ ప్రపంచ స్థాయి టెక్ హబ్‌గా, పరిశ్రమల నగరంగా పేరు తెచ్చుకుంటే రాష్ట్రం మొత్తంగా "ధనిక రాష్ట్రం"గా ప్రచారం కూడా బలమైంది. కానీ ఇటీవల వచ్చిన సమగ్ర సామాజిక--ఆర్థిక కుల సర్వే సమాచారం ఒక వేర్వేరు రాష్ట్రంలోని సంపద కొంత మంది కులాల, కుటుంబాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని తెలుస్తోంది. జనాభాలో 67% మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. అంటే ధనిక రాష్ట్రం అంటే సంపద కొందరి చేతుల్లో మాత్రమే ఉండి, అధికారం--భూమి--అవకాశాలు కూడా వారి చేతిలోకి వెళ్లిన స్థితి.తలసరి ఆదాయం పరంగా తెలంగాణ దేశంలో మొదటి--రెండో స్థానంలో ఉండటం వాస్తవం. 2023--24 అంచనాల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం సుమారు రూ.3.5--3.8 లక్షల మధ్య ఉంది. కానీ ఈ సగటు పైన ఉండిపోతూ, ఉపాధి, ఆస్తులు, అప్పులు, విద్య, ఆరోగ్యం వంటి 42 సూచీల ఆధారంగా తయారు చేసిన సోషియో--ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్, పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే--2024 ( ఉఉక్కఇ--2024) ప్రకారం రాష్ట్ర జనాభాలో 67 శాతం మంది ప్రజలు కనీస జీవన ప్రమాణం కూడా అందుకోలేని స్థితిలో ఉన్నారు. అంటే మొత్తం ధనం కొందరి కుటుంబాల కుటుంబాల్లో మాత్రమే ఒక చక్రంలా తిరుగుతూ, మిగతా భాగానికి హక్కు బాధ్యత స్టేటస్ లేకుండా పోయింది.ప్రభుత్వం 42 సూచీల ఆధారంగా కాంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్ (సీబీఐ) తయారు చేసింది. చదువు, ఉద్యోగం, ఆదాయం, ఆస్తులు, అప్పులు, రాజకీయ ప్రాతినిధ్యం, నివాస సౌకర్యాలు, విదుద్యుత్, తాగునీరు, ఆరోగ్య సేవలు వంటివాటిని స్కోర్‌లుగా మార్చారు. ఈ స్కోర్ 0--126 మధ్య ఉంటుంది. 0 నుంచి 81 లోప తీవ్ర పేదరికం, సామాజిక--ఆర్థికంగా బాహ్యంగా వెనుకబడిన స్థితి. 81 కంటే ఎక్కువ ఉంటే సాపేక్షంగా మెరుగైన, స్థిరపడిన స్థితి. సర్వేలో 242 కులాల్లో 135 కులాలు 0--81 శ్రేణిలో ఉన్నాయి. అంటే రాష్ట్రంలోని సగానికన్నా ఎక్కువ కులాలు దీర్ఘకాలిక పేదరిక చక్రంలో ఉన్నాయి. ఈ సీబీఐ స్కోర్‌లను కులం--ప్రాంతం--జెండర్ వారీగా విశ్లేషిస్తే, ఎవరికి ఎలా అవకాశాలు అందడం లేదో స్పష్టం అవుతుంది.షెడ్యూల్డ్ కాస్ట్(ఎస్సీ)లో 97 శాతం మంది రాష్ట్ర సగటు కన్నా తక్కువ స్థాయిలో ఉన్నారని సీబీఐ సూచిస్తోంది. వ్యవసాయ కూలీలు, దస్తూరీ పనులు, అస్థిర ఉద్యోగాలు, అప్పుల బరువు, విద్యలో ప్రవేశాల పరిమితి, గుడిసెల ప్రజానీకంగా ఉండడం వారిని పేదరిక చక్రంలో పట్టుకుని పెట్టాయి. ఈ కులాలకు చెందిన భూములు, ఆస్తులు చాలా తక్కువగా ఉండడం వారి స్థితిని మరింత గంభీరంగా మార్చింది. షెడ్యూల్డ్ ట్రైబ్స్(ఎస్టీ) 99 శాతం మంది రాష్ట్ర సగటు కంటే తక్కువ స్థాయిలో ఉన్నారు.

## వరంగల్‌లో విషాద ఘటన.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



వరంగల్: వరంగల్?లో విషాద ఘటన జరిగింది. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. వరంగల్ మట్టేవాడ పరిధిలో మహిళా కానిస్టేబుల్ సాదు సంగీత (33) ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. సంగీత భూపాలపల్లిలో మహిళా కానిస్టేబుల్?గా విధులు నిర్వహిస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు ముందు లేఖ రాసి సంగీత ప్రాణం తీసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న మట్టేవాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గత నెలలోనే వికారాబాద్?లో కూడా మానసిక ఒత్తిడి తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. వికారాబాద్ పట్టణంలోని గంగారాం సాయిబాబా కాలనీకి చెందిన బలిజ దివ్య (26) కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తుండేది. ఆమె ధారూర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై రైటర్‌గా విధులు నిర్వహిస్తుంది. దివ్య తన ఇంట్లోనే ఉరి వేసుకుని చనిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పాట్‌కు చేరుకున్నారు.

తండ్రి మరణం తర్వాత కుటుంబంలో ఎదురవుతున్న పరిస్థితులతో కలిగిన మానసిక వేదనే తన మరణానికి కారణమని ఆమె లేఖలో రాసింది. "నాన్న లేకపోవడం వల్లే మనకు ఇన్ని బాధలు. అమ్మా నన్ను క్షమించు" అని లేఖలో రాశారు. తన మరణానికి మానసిక ఒత్తిడే కారణమని దివ్య వివరించింది.






## విద్యా కుసుమాలు - క్రమశిక్షణ ముళ్లు: మారుతున్న కాలం.. మారుతున్న చట్టాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాఠశాలలు కేవలం పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడానికి కీలక కేంద్రాలుగా భావించబడు తున్నాయి. ఈ సందర్భంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశం ఎప్పటికీ ప్రాముఖ్యత కోల్పోని మూల్యంగా నిలిచింది. అయితే క్రమశిక్షణ పేరుతో ఉపాధ్యాయులు తీసుకునే చర్యలు ఎంతవరకు చట్టబద్ధం, ఎంతవరకు నైతికంగా సమర్థించదగినవి అన్నది కాలక్రమేణా పెద్ద చర్చా విషయంగా మారింది. తాజాగా కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ చర్చకు మరో కొత్త మలుపు నిచ్చింది. విద్యార్థిని క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయుడు బెత్తంతో కొట్టిన ఘటనలో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ కోర్టు చేసిన వ్యాఖ్యలు విద్యా రంగం, న్యాయ వ్యవస్థ, మానవ హక్కుల వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి.తిరువనంతపురంలోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనలో విద్యార్థి అశ్రద్ధగా ప్రవర్తించాడనే కారణంతో ఉపాధ్యాయుడు స్టాఫ్ రూమ్‌లో బెత్తంతో కొట్టాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసులు భారతీయ న్యాయ సంహిత (దీచీూ) మరియు జువైనల్ జస్టిస్ (జీజీ) చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు సాధారణంగా పిల్లలపై హింస, వేధింపుల కేసుల్లో ఉపయోగించబడే కఠినమైన నిబంధనలు. అయితే ఈ కేసులో ఉపాధ్యాయుడు తన చర్య క్రమశిక్షణ కోసమే జరిగిందని, దానిలో ఎటువంటి క్రూర ఉద్దేశం లేదని వాదిస్తూ హైకోర్టును ఆశ్రయించాడు.కేసును విచారించిన ధర్మాసనం కొన్ని కీలక అంశాలను పరిశీలించింది. మొదటగా, విద్యార్థికి తలెత్తిన గాయాల తీవ్రత. మెడికల్ రిపోర్టుల ప్రకారం విద్యార్థి శరీరంపై ఎటువంటి గంభీర గాయాలు లేవని తేలింది. ఇది కేసు తీవ్రతను తగ్గించే ప్రధాన అంశంగా కోర్టు పరిగణించింది. రెండవది, ఘటన జరిగిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత ఆసుపత్రికి వెళ్లడం. దీనిని కోర్టు అనుమానాస్పదంగా భావించింది. మూడవది, ఉపయోగించిన సాధనం---'బెత్తం'. చట్టపరంగా ఇది ప్రమాదకరమైన ఆయుధం కాదని కోర్టు స్పష్టం చేసింది.ఈ అంశాలన్నింటినీ సమీక్షించిన తరువాత కోర్టు 'మెన్స్ రియా' అనే న్యాయ సూత్రాన్ని ప్రస్తావించింది. అంటే నేరం జరగాలంటే కేవలం చర్య మాత్రమే కాకుండా దాని వెనుక నేరపూరిత ఉద్దేశం కూడా ఉండాలి. ఈ కేసులో ఉపాధ్యాయుడి చర్య క్రమశిక్షణ పరిరక్షణ కోసమే జరిగిందని, దానిలో క్రూరత్వం లేదా ద్వేషభావం కనిపించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల ఈ చర్యను నేరంగా పరిగణించడం సబబు కాదని పేర్కొంది.ఈ తీర్పు ద్వారా కోర్టు మరో ముఖ్యమైన అంశాన్ని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులకు విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు కొంత పరిమిత అధికారాన్ని చట్టం అనుమతిస్తుందని పేర్కొంది. అయితే ఈ అధికారం అపరిమితం కాదు. అది సదుద్దేశంతో, సమంజసమైన పరిమితుల్లో, క్రూరత్వం లేకుండా వినియోగించబడాలి. ఈ సూత్రం ద్వారా కోర్టు ఒక సున్నితమైన సమతుల్యతను సూచించింది---విద్యార్థుల హక్కులను కాపాడుతూ ఉపాధ్యాయుల పాత్రను పరిరక్షించడం.ఇక్కడ ఒక విస్తృత సామాజిక నేపథ్యాన్ని పరిశీలించడం అవసరం. భారతదేశంలో శారీరక శిక్ష (ఏశీతీజూశీతీుశ్రీ జూబఅఱంష్ట్రఎవఅ్) పై చట్టపరమైన దృక్కోణం గత కొన్ని దశాబ్దాల్లో గణనీయంగా మారింది. ఒకప్పుడు "బెత్తం బుద్ధి చెబుతుంది" అనే భావన సాధారణంగా అంగీకరించబడేది. కానీ పిల్లల హక్కులపై అవగాహన పెరగడంతో ఈ దృక్కోణం మారింది. 2009లో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టం (=అస్త్రష్ట్ర్ ˉశీ జుఽబఝ్అశీఅ ాూవ్) ప్రకారం పాఠశాలల్లో శారీరక శిక్షను నిషేధించారు.

అలాగే జువైనల్ జస్టిస్ చట్టం కూడా పిల్లలపై హింసను కఠినంగా శిక్షిస్తుంది.నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (చీజూజ=) నివేదికల ప్రకారం భారతదేశంలో ఇంకా అనేక పాఠశాలల్లో శారీరక శిక్ష కొనసాగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో సుమారు 60 శాతం వరకు ఎప్పుడో ఒకసారి శారీరక శిక్షను అనుభవించినట్లు వెల్లడైంది. ఇది చట్టం ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని చూపిస్తుంది.ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు తీర్పు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది---శారీరక శిక్షను పూర్తిగా నిషేధించిన చట్టాల నేపథ్యంలో "పరిమిత శారీరక చర్య"కు స్థానం ఉందా? కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా శారీరక శిక్షకు మద్దతు ఇవ్వలేదు. కానీ ప్రతి సందర్భాన్ని దాని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా పరిశీలించాలని సూచించింది. ఇది ఒక రకంగా 'సందర్భానుసార న్యాయం' భావనకు దగ్గరగా ఉంటుంది.ఇంకొక కోణంలో చూస్తే, ఈ తీర్పు ఉపాధ్యాయులపై పెరుగుతున్న చట్టపరమైన ఒత్తిడిని కూడా ప్రతిబింబిస్తుంది. గతంలో క్రమశిక్షణ పేరుతో తీసుకున్న చర్యల వల్ల అనేక ఉపాధ్యాయులు కేసుల్లో ఇరుక్కుపోయిన సందర్భాలు ఉన్నాయి. దీని వల్ల పాఠశాలల్లో క్రమశిక్షణ అమలు చేయడంలో ఉపాధ్యాయులు వెనుకడుగు వేస్తున్నారని విద్యా నిపుణులు అంటున్నారు. కేరళ హైకోర్టు తీర్పు ఈ భయాన్ని కొంతవరకు తగ్గించే ప్రయత్నంగా కూడా చూడవచ్చు.అయితే ఈ తీర్పుపై విమర్శలు కూడా లేకపోలేదు. పిల్లల హక్కుల కోసం పోరాడే సంస్థలు ఈ నిర్ణయం ప్రమాదకర సందేశాన్ని పంపవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "సదుద్దేశం" అనే పదం సబ్జెక్టివ్‌గా ఉండటం వల్ల దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు తన చర్యను సదుద్దేశంతో చేశానని చెప్పడం ద్వారా శారీరక శిక్షను సమర్థించుకునే పరిస్థితి రావచ్చని విమర్శిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఒక సమగ్ర దృక్కోణం అవసరం. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడం అనివార్యం. కానీ దానికి ఉపయోగించే పద్ధతులు సమకాలీన విలువలకు అనుగుణంగా ఉండాలి. సైకాలజీ పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, శారీరక శిక్ష తాత్కాలికంగా ప్రవర్తనను నియంత్రించగలిగినా దీర్ఘకాలంలో భయం, ఆత్మవిశ్వాస హీనత, ఆగ్రహం వంటి ప్రతికూల ప్రభావాలు కలిగిస్తుంది. అందువల్ల సానుకూల క్రమశిక్షణ , ప్రవర్తనా మార్పు పద్ధతులు, కౌన్సెలింగ్ వంటి మార్గాలు ఎక్కువగా ప్రోత్సహించ బడుతున్నాయి. కేరళ హైకోర్టు తీర్పు ఒక చట్టపరమైన స్పష్టతను అందించినప్పటికీ, ఇది విద్యా వ్యవస్థలో ఉన్న విభిన్న సవాళ్లను కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. క్రమశిక్షణ మరియు మానవ హక్కుల మధ్య సమతుల్యత ఎలా సాధించాలి అన్న ప్రశ్నకు ఇది తుది సమాధానం కాదు, కానీ ఒక దిశను సూచించే ప్రయత్నం మాత్రమే. భవిష్యత్తులో ఈ అంశంపై మరింత స్పష్టమైన మార్గదర్శకాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, పాఠశాల స్థాయిలో నియంత్రణ వ్యవస్థలు అవసరం అవుతాయి.అంతిమంగా విద్య అంటే కేవలం నియంత్రణ కాదు, మార్గనిర్దేశం. శిక్ష అంటే భయం కాదు, అవగాహన. ఈ విలువలను ప్రతిబింబించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పుడే సమాజం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందుతుంది.

## సమ్మె, సంక్షోభం, సంస్కరణలు... ఆర్టీసీ భవిష్యత్తు ఎటు?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది. సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (ఙూు) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చు కోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్సిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలోమీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా,

సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు మరియు సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది. ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 22 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం కార్మికుల సాధ్యాసాధ్యమైన కోర్కెలను సానుకూలంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది. అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

# శ్రీకాకుళం లో మహానాడు...

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21, పెన్ పవర్:**
టీడీపీకి అత్యంత కీలకమైన మహానాడును ఈ ఏడాది ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే.. దీనిపై అధికారికంగా ప్రకటన రావలసి ఉంది. ఇక, శ్రీకాకుళంలో ఇప్పటికే దీనిపై ఏర్పాట్లు కూడా ముమ్మరం చేస్తున్నారు. ఈ దఫా 3-5 లక్షల మంది వరకు కార్యకర్తలు వస్తారన్న అంచనాలువున్నాయి. దీంతో ఆ రేంజ్‌లోనే ఏర్పాట్లను కూడా ముమ్మరం చేస్తున్నారు. రీజనేంటి..? శ్రీకాకుళంలో మహానాడును నిర్వహించేందుకు మూడు కారణాలు కనిపిస్తున్నాయి.

1) ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం: ఇతర జిల్లాలలతో పోల్చుకుంటే.. ఉత్తరాంధ్రలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళా ఓటర్ల సంక్య ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడ మరింత బలపడేందుకు అవకాశం ఉంటుందని పార్టీ అంచనా వేసింది. 2) యువతకు ప్రాధాన్యం: ఉత్తరాంధ్రలో జనాభా లెక్కల ప్రకారం.. యువ త ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరిని ఆకర్షించేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇక్కడ మహానాడుకు సిద్ధమైంది. అదేస మయంలో ఏటా ప్రాంతాలను కూడా మారుస్తున్న క్రమంలో గతంలో రాయల సీమలో నిర్వహించారు. ఈ దఫా ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇచ్చారు. 2027లో మళ్లీ గుంటూరులోను, 2028లో సీమలోనూ నిర్వహించేలా ప్లాన్ చేసినట్టు సమాచారం.

3) అభివృద్ధి: అభివృద్ధి పరంగా ఉత్తరాంధ్రకు ఇటీవల కాలంలో ఎక్కువగా ప్రాధాన్యం దక్కింది. భోగాపురం విమానాశ్రయంతోపాటు.. శ్రీకాకుళంలోని ఉద్దానంలో కిడ్నీ వైద్య శాలల ఏర్పాటు.. విశాఖలో ఐటీ సహా.. డేటా కేంద్రాలు.. వంటివి విరివిగా వస్తున్నాయి. ఈ అభివృద్ధిని చాటి చెప్పేందుకు కూడా మహానాడును వేదికగా చేసుకునేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఈ మూడు కారణాలతోనే శ్రీకాకుళంలో మహానాడుకు ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది.

మహానాడు కేంద్రంగా బాధ్యతలు

తెలుగుదేశం పార్టీకి భవిష్యత్తు ఆశా కిరణంగా నారా లోకేష్ ఉన్న సంగతి తెలిసిందే. ఆయన తండ్రి చాటు బిడ్డగా రాజకీయాల్లోకి ప్రవేశించి ఈ రోజున ఇంతింతై వటుడింతై అన్నట్లుగా టీడీపీలో సర్వం తానై అన్నట్లుగా ఎదిగారు. ఆయన గడచిన దశాబ్ద కాలంలో రాష్ట్రం మీద తనదైన ముద్రను బలంగా వేశారు. నారా లోకేష్ ని పప్పు అన్న వారే నిప్పు అనుకునేలా ఆయన తనను తాను సాన పట్టుకున్నారు. అందుకే నారా లోకేష్ కి టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని



ఇచ్చినా ఏ ఒక్కరి నుంచి వ్యతిరేక స్వరం కానీ అసంతృప్తి గళం కానీ వినిపించలేదు. పైగా ఎక్కడా ఎలాంటి రిమార్క్స్ కూడా సోషల్ మీడియాలో కానీ మెయిన్ స్ట్రీమ్ మీడియాలో కానీ రాకపోవడం చూస్తూంటే ఒక విధంగా లోకేష్ సాధించిన విజయం ఏమిటో అర్థం అవుతుంది. టీడీపీలో మూడవ తరం నాయకత్వం బాధ్యతలు స్వీకరించేందుకు లోకేష్ సిద్ధంగా ఉన్నారు. ఇక ఆ బాధ్యతల స్వీకరణ అన్నది కూడా చాలా సాఫీగా సాగిపోవడం విశేషం. ఒక్కసారి మూడు దశాబ్దాల వెనక్కి వెళ్తే ఎన్టీఆర్ నుంచి చంద్రబాబుకు పగ్గాలు దక్కడం వెనక ఒక పెద్ద రాజకీయ సమరమే సాగింది. కానీ ఇపుడు అలా కాదు చాలా స్మూత్ గా ఇదంతా సాగింది అంటే నారా లోకేష్ కి దక్కిన అదృష్టంగానే అంతా భావిస్తున్నారు. మరో వైపు చూస్తే లోకేష్ కూడా ఎప్పటికపుడు తనను తాను సమర్థుడిగా నిరూపించుకునే ప్రయత్నం చేస్తూ అందులో సక్సెస్ కావడం కూడా ఆయనకు ఆ పదవి వరించేందుకు ఆస్కారం ఇచ్చింది అని చెప్పాలి. టీడీపీ అధినాయకత్వం తాజాగా ప్రకటించిన జాతీయ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకరణ ఘట్టం ఈ నెల 29న అట్టహాసంగా సాగుతుంది అని అంటున్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అది జరుగుతుందా లేదా వేరే వేదికను చూస్తారా అన్నది పక్కన పెడితే ఆ రోజున మంచి ముహూర్తంగా భావించి పార్టీ పగ్గాలను లోకేష్ స్వీకరించనున్నారు అని అంటున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అంటే అన్ని విషయాలు లోకేష్ చూస్తారు, అత్యంత ముఖ్యమైనవి తప్పితే చంద్రబాబు దాదాపుగా పార్టీ విషయాలు అన్నీ లోకేష్ కి అప్పగించినట్లే అని అంటున్నారు. ఈసారి మహానాడు రూపకల్పన బాధ్యత అంతా వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని అంటున్నారు. లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక చేసే అతి పెద్ద పార్టీ కార్యక్రమంగా ఇది ఉండబోతోంది. ఉత్తరాంధ్రాలోని నెల్లిమర్లలో ఈసారి మహానాడుని నిర్వహిస్తున్నారు. దాంతో నెల రోజులు మాత్రమే సమయం ఉన్నందున లోకేష్ పార్టీ మొత్తాన్ని సమాయత్తం చేస్తారు అని అంటున్నారు. అదే విధంగా ఈసారి మహానాడు లో ఏ తీర్మానాలు చేయాలి, ఏ అంశాలను ఫోకస్ చేయాలి అన్న విషయాలు కూడా చంద్రబాబుతో చర్చించి మరీ లోకేష్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తారు అని అంటున్నారు. ఇక రానున్న రోజులలో పార్టీ పరంగా ఏమి చేయాలన్నా కూడా నారా లోకేష్ దే అతి ముఖ్య పాత్ర అని చెబుతున్నారు. మొత్తం మీద టీడీపీలో మూడు దశాబ్దాల తరువాత నాయకత్వం విషయంలో అతి పెద్ద మార్పు రాబోతోంది. ఈసారి దానిని భారీ ఎత్తున వేడుకగా జరుపుకోవడానికి పార్టీ మొత్తం సిద్ధంగా ఉండడమే అసలైన విశేషంగా చూడాల్సి ఉంది.

# దుమ్మురేపిన బంగారు నాణేలు


**కోటిన్నర విలువైన డాలర్ల అమ్మకం**

**తిరుమల, ఏప్రిల్ 21, పెన్ పవర్:**
అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి సన్నిధిలో బంగారు నాణేల విక్రయాలు రికార్డు స్థాయికి చేరాయి. ఆదివారం ఒక్కరోజే రూ. 70 లక్షలు, సోమవారం మరో రూ. 40 లక్షల మేర వ్యాపారం జరిగింది. తిరుమలలో మాత్రమే కాదు తెలుగు రాష్ట్రాల్లోని జ్యువెలరీ షాపులు, డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్స్ కూడా కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా తిరుమలలో రికార్డు స్థాయిలో బంగారు నాణేలు విక్రయాలు జరిగాయి. తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ బంగారు, వెండి, రాగి డాలర్ల విక్రయ కౌంటర్‌లో భక్తులు భారీగా కొనుగోళ్లు జరిపారు. ఆదివారం రోజు ఏకంగా రూ. 70 లక్షలు, సోమవారం రూ. 40 లక్షల విలువైన డాలర్లను భక్తులు కొనుగోలు చేశారు. గతేడాది అక్షయ తృతీయ సందర్భంగా దాదాపు రూ. 90 లక్షల విలువైన డాలర్లను కొనుగోలు చేయగా.. ఈ ఏడాది అంతకుమించి కొనుగోళ్లు జరిగాయి. అది కూడా బంగారం ధరలు భారీగా పెరిగినా సరే భక్తులు బంగారు నాణేలను కొనుగోలు చేశారు. అక్షయ తృతీయ గడియలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మధ్యాహ్నం వరకు ఉండటంతో భక్తులు నాణేలను కొనుగోలు చేశారు. శ్రీవారి ముద్ర ఉన్న నాణేలను కొనుగోలు చేయడం శుభప్రదమని భావించిన భక్తులు టీటీడీ విక్రయశాలలకు క్యూ కట్టారు. టీటీడీ తిరుమలలో శ్రీవారి చిత్రంతో బంగారు డాలర్లను విక్రయిస్తోంది. అలాగే వెండి, రాగి డాలర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ఇటీవల బంగారం ధరల్లో మార్పులు చేయడంతో టీటీడీ కూడా నిబంధనల్ని మార్చాల్సి వచ్చింది. తిరుమలలో విక్రయించే బంగారు డాలర్ల ధరలు వారానికి ఒకసారి మార్చేవారు. ప్రస్తుతం బంగారం ధరలు రోజూవారీ మారుతున్నాయి. ఈ క్రమంలో టీటీడీకి నష్టం వస్తోంది.. అందుకే టీటీడీ అందుకు తగిన విధంగా మార్పులు చేశారు. మరోవైపు తిరుమల శ్రీవారికి మరో భారీ విరాళం అందింది.

హైదరాబాద్‌కు చెందిన వైకెడి మల్లికార్జునరావు అనే భక్తుడు తన కుటుంబ సభ్యుల పేరుతో రూ. కోటి విరాళం అందజేశారు. అందులో టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 25 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ. 20 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ. 10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ. 25 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ. 10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ. 10 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీలను అందజేశారు.

# 46 మండలాల్లో తీవ్ర ఎండలు

**విజయవాడ, ఏప్రిల్ 21, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో ఓవైపు ఎండలు, మరోవైపు వేడిగాలులు, ఉక్కపోత వాతావరణం కనిపిస్తోంది. దీనికి తోడు కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్ని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 46 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 29 మండలాల్లో సాధారణ వేడగాలులు వీచే అవకాశం ఉందని.. పలు జిల్లాల్లో వర్షాలు పడే ఛాన్స్ ఉందంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నిప్పులకొలిమిలా మారింది.. ఓ ఎండ, వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. కోస్తాతో పాటుగా రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తున్నాయి. రాష్ట్రంలో ఎండ, వేడిగాలులు, ఉక్కపోత తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇవాళ 46 మండలాల్లో వేడిగాలులు తీవ్రంగా వీస్తాయని.. 29 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని అంచనా వేశారు. గురువారం 54 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 15 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉంది అన్నారు. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొరిమన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి కొనసాగుతుంది. ద్రోణి ప్రభావంతో ఇవాళ అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపడతాయని అంచనా వేస్తున్నారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం రోజు పార్వతీపురం మన్యం



జిల్లా మక్కువలో 44.2 డిగ్రీలు, కర్నూలు జిల్లా చిప్పగిరిలో 43.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం రోజు ఏకంగా 289 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయిఏపీలోని పలు జిల్లాల్లో వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉంది కాబట్టి.. రైతులు, పశు కాపరులు చెట్ల కింద ఉండకూడదు. అలాగే ఎండ తీవ్రతను గమనించి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణిలు జాగ్రత్తగా ఉండాలని.. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు

ఎండలో ప్రయాణాలు చేయకపోవడమే మంచిది అంటున్నారు. బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా టోపీ, రుమాలు ధరించాలని తెలిపారు. ప్రజలు తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పొలాలు, ఆరు బయట పనిచేసే వారు వాతావరణ మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

# షర్మిల సైతం పాదయాత్ర.. పునరాలోచనలో జగన్

**కడప, ఏప్రిల్ 21, పెన్ పవర్:** రాజకీయాల్లో పాదయాత్రలు కొత్త కాదు. కానీ పాదయాత్ర మొదలు పెట్టింది వైయస్ రాజశేఖర్ రెడ్డి. వరుసగా రెండుసార్లు ఓటమితో ఏపీలో పూర్తి నిర్వేదంతో ఉండేది కాంగ్రెస్ పార్టీ. దేశంలో అయితే దాదాపు పది సంవత్సరాలకు పైగా అధికారానికి దూరంగా ఉండేది. అటువంటి సమయంలో పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి. అయితే ఆయన తరువాత ఎంతోమంది పాదయాత్రలు చేసి అధికారంలోకి వచ్చారు. చంద్రబాబుతో పాటు జగన్ మోహన్ రెడ్డి ఈకోవలోకి చేరుతారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి సైతం పాదయాత్ర చేసి అక్కడ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అయితే ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు పాదయాత్ర అనేది అధికారం తెచ్చిపెట్టి ఒక జడ పదార్థంగా మారింది. అందుకే ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి మరోసారి వైసీపీని అధికారంలోకి తెచ్చేందుకు వ్యూహరచన చేస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆయనకు తన సోదరి షర్మిల నుంచి పిడుగు లాంటి వార్త వచ్చింది. గతంలో షర్మిల పాదయాత్ర చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన తర్వాత ఆయన అక్రమాస్తుల కేసుల్లో జైలుకు వెళ్లిపోయారు. అయితే కొంతవరకు పాదయాత్ర చేసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ జరిగింది. అటు తరువాత షర్మిల ఆ పాదయాత్ర బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు. జగన్మోహన్ రెడ్డి లేని లోటును తీర్చారు. ఒక విధంగా 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 67 సీట్లు తెచ్చుకోవడానికి షర్మిల పాదయాత్ర కూడా ఒక కారణం. అయితే షర్మిల పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని 2017లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. అలా వచ్చిన తర్వాత షర్మిలను పట్టించుకోవడం మానేశారు. దీంతో షర్మిల జగన్మోహన్ రెడ్డిని కేవలం కుటుంబ పరంగా కాదు రాజకీయంగాను విభేదిస్తూ వచ్చారు. ఇప్పటికీ విభేదిస్తూ వస్తున్నారు.

వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీ అధికారంలోకి రావాలి. రాకపోతే చాలా ఇబ్బంది కరం కూడా. అందుకే జగన్మోహన్ రెడ్డి సుదీర్ఘకాలం పాదయాత్రకు ప్లాన్ చేశారు. వచ్చే ఏడాది వైయస్సార్ జయంతి రోజున పాదయాత్రను ప్రారంభించి 2029 ఎన్నికల ముంగిట ముగించాలని ప్రణాళిక వేశారు. కానీ ఇప్పుడు షర్మిల సైతం పాదయాత్ర చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సరిగ్గా జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయానికి తాను మొదలు పెట్టాలని షర్మిల భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షర్మిల ద్వారా జగన్మోహన్ రెడ్డికి ఎంతలా పొలిటికల్ డ్యామేజ్ జరిగిందో తెలియంది కాదు. అందుకే షర్మిల పాదయాత్ర అంటేనే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి బెంబేలెత్తిపోతున్నారు. అయితే త్వరలో షర్మిల తన పాదయాత్ర షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ షర్మిల పాదయాత్ర ప్రారంభిస్తే మాత్రం జగన్మోహన్ రెడ్డికి కష్టమని వైసిపి శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి.

# జాతీయ పార్టీగా జనసేన

**అనంతపురం, ఏప్రిల్ 21, పెన్ పవర్:** జనసేన నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. ఏపీలో కూటమిపరంగా అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ విస్తరణ పై సరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కేరళలో ఆ పార్టీ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్రంలో వివిధ పార్టీల్లోని 200 మంది నేతలు జనసేనలో చేరడం విశేషం. జనసేన అగ్ర నేతలు నాగబాబు, రామ్ తాళ్లూరిల సమక్షంలో కేరళలో జనసేనలో చేరికలు పెరిగాయి. కేరళ నుంచి వచ్చిన వినతులు మేరకు పవన్ కళ్యాణ్ స్పందించారు. నాగబాబు తో పాటు రామ్ తాల్లూరిలను అక్కడకు పంపించారు. అయితే కేరళలో పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరడం ఇప్పుడు కొత్త ప్రచారానికి తెరతీసింది. మున్ముందు జనసేన రాజకీయ ప్రయాణం దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్‌ఎప్పుడు దూకుడు రాజకీయాలు చేయలేదు. జనసేన పరంగా దూకుడుగా అడుగులు వేయలేదు. ముందుగా ఏపీలో సిద్ధాంత పరంగా ముందుకు వెళ్లారు. సంప్రదాయ రాజకీయ పార్టీ మాదిరిగా అస్సలు వ్యవహరించలేదు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితేనే కొనసాగాలని కుండబద్దలు కొట్టారు నాయకులకు. భారతీయ జనతా పార్టీ మాదిరిగా సిద్ధాంత పరంగా జనసేనను నిలబెట్టాలని చూశారు. ఈ క్రమంలో హిందుత్వ వాదాన్ని, సనాతన ధర్మ పరిరక్షణ నినాదాన్ని అందుకున్నారు. దీని వెనుక లోతైన వ్యూహం ఉంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. కానీ బలమైన సిద్ధాంతాల నడుమ అవి కొనసాగుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతం పూర్తిగా రాజకీయ పార్టీలను కబలించింది. అటువంటి చోట సనాతన ధర్మం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి.. ఒక వర్గం ప్రజలను ఆకర్షించగలిగారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే వ్యూహంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పుడు కేరళలో అది వర్క్ అవుట్ అయ్యేలా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున నేతల చేరిక.. తిరువనంతపురంలోజరిగిన జనసేన సమావేశంలో చాలామంది నేతలు ఆ పార్టీలో చేరారు. ప్రధానంగా నేషనల్ లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయ లోక్ దళ్, కాంగ్రెస్ పార్టీల నుంచి 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అయితే ఈ ఉత్సాహం చూస్తుంటే మాత్రం తదుపరి లక్ష్యంగా కర్ణాటక పై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. క్రమేపి తమిళనాడుతో పాటు తెలంగాణలో కూడా పార్టీ విస్తరించి.. జాతీయ పార్టీగా అవతరించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పవన్ కళ్యాణ్ భావజాలం భాషలతో పాటు ప్రాంతాలకు అతీతంగా దేశస్థాయిలో ప్రజలను ఆకట్టుకుంటుందని జనసేన నాయకత్వం భావిస్తోంది. చూడాలి మరి ఆ పార్టీ ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో..

# లోకేష్ టీం రెడీ...

**విజయవాడ, ఏప్రిల్ 21, పెన్ పవర్:** ఏ రాజకీయ పార్టీ అయినా రాణించాలి అంటే కచ్చితంగా టీం వర్క్ ఉండాలి. అధినేత ఆదేశాలను పాటించే వారు కచ్చితంగా ఉండాలి. అప్పుడే ఆ అధినేత పార్టీపై పట్టు సాధించగలరు. అయితే నందమూరి తారక రామారావు టిడిపి ఏర్పాటు చేసిన సమయంలో నమ్మకస్తులు దొరికారు. తరువాత చంద్రబాబు టీం లో కూడా కొంతమంది సీనియర్లు చేరారు. అయితే ఎన్టీఆర్ కు ఒక ప్రత్యేకత ఉంది. చంద్రబాబుకు ప్రత్యేకత మరోలా ఉంది. ఎన్టీఆర్ పార్టీ నేతలను గౌరవించేవారు. ఒక నిర్ణయం తీసుకుని పార్టీ నేతల అభిప్రాయం అడిగేవారు. చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకునే ముందు పార్టీ నేతలతో చర్చించి వారి అభిప్రాయాన్ని తీసుకునేవారు. అంతిమంగా ఒక నిర్ణయానికి వచ్చేవారు. అయితే లోకేష్ మాత్రం ఇప్పుడు టీం వర్క్ ను నమ్ముకున్నారు. తనకంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని.. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని ఒక నిర్ణయానికి వస్తున్నారు. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ విషయంలో ఆయన అంచనాలు తప్పాయి. దాని పర్యవసానాలే 1995లో టిడిపి సంక్షోభం. తెలుగుదేశం పార్టీని వదులుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వాన్ని వదులుకోవాల్సి వచ్చింది. ఎన్టీఆర్ ఒక పట్టుదల మనిషి. ఏదైనా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. నిర్ణయం తీసుకున్నాక ఆలోచించరు. ఈ క్రమంలోనే చాలామంది సీనియర్లు ఆయనకు దూరం అయ్యారు. చంద్రబాబుపై వెన్నుపోటు అపవాదు వచ్చింది నిజమే. కానీ టిడిపిలో చాలామంది సీనియర్లు ఎన్టీఆర్ తో విభేదించి చంద్రబాబు వద్దకు చేరారు తప్పించి.. చంద్రబాబు వారిని ఆకర్షించారు అనలేం. అయితే ఆ ఎపిసోడ్ నుంచి గుణపాఠాలు నేర్చుకున్నారు చంద్రబాబు. అందుకే పార్టీలో సీనియర్లను గౌరవిస్తూ వచ్చారు. ముఖ్యంగా విధేయుల బృందాన్ని తన చుట్టూ ఉంచుకున్నారు. అప్పట్లో నందమూరి తారక రామారావు లో ఈ ఆలోచన లేదు. ఆయన ఎంతవరకు కాంగ్రెస్ లాంటి పార్టీనే ఓడించాను.. తన మాట, తన గీత పార్టీ నేతలు దాటరు అని భావించారు. ఈ క్రమంలో జరిగిన తప్పిదాలతో చాలామంది నేతలు మనస్థాపానికి గురయ్యారు. ఎన్టీఆర్ కు దూరమయ్యారు. అయితే చంద్రబాబు అపర చాణుక్యుడు. రాజకీయ ప్రత్యర్థులు సైతం ఇదే మాట చెబుతారు. ఎన్టీఆర్ ఎపిసోడ్లో చాలా రకాల గుణపాఠాలు నేర్చుకున్నారు. పార్టీలో పరిస్థితిని ఆకలింపు చేసుకున్నారు. అందుకే పార్టీలో సీనియర్లను తన చెప్పు చేతల్లో ఉంచుకున్నారు. వారిని గౌరవించి ఒక రక్షణ కవచంలా మార్చుకున్నారు. అందుకే మధ్యలో వైయస్ రాజశేఖర్ రెడ్డి రూపంలో ప్రలోభాలు ఎదురయ్యాయి. ప్రజారాజ్యం పార్టీ రూపంలో ప్రత్యామ్నాయం వచ్చింది. తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపంలో ఒక ఆకర్షణ శక్తి ఉద్భవించింది. కానీ వాటన్నింటినీ పట్టుకొని నిలబడింది అంటే చంద్రబాబు చాణుక్యం. అదే టిడిపిని నిలబెట్టింది. అయితే ఇప్పుడు టిడిపిలో మూడో తరం వచ్చింది. లోకేష్ టీం రెడీ అయింది. కిలారు రాజేష్ లాంటి నేతలను ఏకంగా జాతీయ ప్రధాన కార్యదర్శి పోస్టులో పెట్టారు అంటే.. లోకేష్ ఆలోచన ఏ స్థాయికి వెళ్ళిందో అర్థం చేసుకోవచ్చు. అయితే లోకేష్ టీం కూర్పు ఇప్పటిది కాదు. గత రెండు సంవత్సరాలుగా ఇది కొనసాగుతూ వస్తోంది. చంద్రబాబు టీంకు మించి.. భవిష్యత్తు ఆలోచించి దీనిని రూపొందించినట్లు అర్థమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## దిగొస్తున్న ట్రంప్ ... స్వయంగా..!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో జరిగే రెండో విడత చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపే స్వయంగా పాల్గొనే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. వ్యక్తిగతంగా కానీ, లేక వర్చువల్‌గా కానీ ఆయన ఆ చర్చలకు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్టు రైటర్స్ మీడియా సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలు ఈ వారంలో జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఇరాన్, అమెరికా దౌత్యవేత్తల మధ్య బుధవారం ఆ చర్చలు జరిగే అవకాశం ఉన్నది. ఒకవేళ ఒప్పందంపై సంతకం చేయాల్సి వస్తే, అప్పుడు ట్రంప్ ఆ డీల్ మీట్‌కు హాజరయ్యే ఛాన్సు ఉన్నట్టు రైటర్స్ సంస్థ తన రిపోర్టులో వెల్లడించింది. అన్నీ సజావుగా సాగుతున్నాయని, రేపు చర్చలు జరిగే అవకాశం ఉన్నట్టు ఓ పాకిస్థానీ అధికారి ఇచ్చిన సమాచారాన్ని ఆ మీడియా సంస్థ షేర్ చేసింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య కుదిరిన రెండు వారాల సీజ్‌ఫైర్ బుధవారంతో ముగియనున్నది. అయితే ఆ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడించే అవకాశాలు లేవని ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.

## భారత నౌకపై కాల్పులపై ఇరాన్ విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:** హెర్మూజ్ జలసంధిలో భారత నౌకలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగాయనే వార్తలపై ఇరాన్ స్పందించింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు. భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అనే అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. కాల్పులు జరిగినట్టు ధ్రువీకరణ కాలేదని, అయితే ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున వాటిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. హెర్మూజ్ జలసంధిలో శనివారం రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీ కాల్పులు జరిపినట్టు వార్తలు వచ్చాయి. ఐఆర్‌జీసీ అనుమతి లభించిన తర్వాతే ఆ రెండు నౌకలు హెర్మూజ్ లోకి ప్రవేశించాయి. అయినప్పటికీ వాటిపై దాడి జరిగింది. ఈ ఘటనపై సీరియస్ అయిన కేంద్ర ప్రభుత్వం భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతే అలీకి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. 'భారత నౌకలను మా దళాలే లక్ష్యంగా చేసుకున్నాయా అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయి' అని ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు. చర్చల విషయంలో అమెరికా సీరియస్‌గా లేదని అభిప్రాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని అన్నారు.

## ఉచితాలపై పిల్‌పై స్పందించిన సుప్రీం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రకటించే ఉచిత హామీలపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పై సుప్రీంకోర్టు స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ), కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో దీనిని జత చేస్తున్నట్లు కోర్టు పేర్కొంది.
ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారం పడుతుందని, ఇది రాష్ట్రాల అప్పులను పెంచి భవిష్యత్తు తరాలపై పెను భారం వేస్తుందని పిటిషనర్ వాదించారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఇచ్చే హామీల వల్ల ప్రభుత్వానికి ఎంత ఖర్చవుతుంది? ఆ నిధులను ఎక్కడి నుంచి సేకరిస్తారు? అనే విషయాలను స్పష్టం చేస్తూ 'ఆర్థిక ప్రభావ ప్రకటన') సమర్పించాలని కోరారు
నిబంధనలు ఉల్లంఘించే లేదా ఆర్థికంగా సాధ్యం కాని హామీలు ఇచ్చే పార్టీలపై గుర్తింపు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎన్నికల ప్రజాస్వామ్యంలో సంక్షేమ పథకాలకు, అనవసరమైన ఉచితాలకు మధ్య ఉన్న సన్నని గీతను ఈ విచారణ తేల్చనుంది. ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణను కాపాడటమే లక్ష్యంగా ఈ పిటిషన్ దాఖలైంది. కోర్టు విచారణ అనంతరం కేంద్రం , ఎన్నికల సంఘం ఇచ్చే వివరణలు భారత ఎన్నికల వ్యవస్థలో కీలక మార్పులకు దారితీసే అవకాశం ఉంది.

## అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలకు డ్రై-డే అమలు- ఇసిఐ

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా ఇసిఐ నిబంధనలను ప్రకటించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం - 1951లోని 135సీ సెక్షన్ ప్రకారం ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే వరకు 48 గంటల పాటు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుంది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని హోటల్, భోజన శాలలు, మద్యం అమ్మే దుకాణాలు, మరే ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాల్లో అయినా.. మద్యం, పులియబెట్టిన లేదా మత్తు కలిగించే లిక్కర్ లేదా ఎలాంటి ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు లేదా పంపిణీ చేయకూడదు. పైన పేర్కొన్న చట్టం ప్రకారం.. శాసనసభ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధలనకు అనుగుణంగా పోలింగ్ పూర్తయ్యే వరకు 48 గంటల పాటు డ్రై డేగా ప్రకటించాలి. ఒకవేళ ఏదైనా రీ-పోల్ చేయాల్సి వస్తే, ఆ తేదీకి కూడా ఇది వర్తిస్తుంది. ఓట్ల లెక్కింపు జరిగే రోజైన 2026 మే 4 (సోమవారం)న కూడా ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధనల ప్రకారం డ్రై డేగా ప్రకటించాలని కమిషన్ ఆదేశించింది. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, క్లబ్బులతో సహా మద్యం అమ్మే లేదా అందించే ఏ ఇతర సంస్థలైనా పైన పేర్కొన్న తేదీల్లో మద్యాన్ని ఎవరికైనా అమ్మడానికి లేదా అందించడానికి అనుమతి లేదు. నాన్-ప్రొప్రయిటరీ క్లబ్బులు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, మద్యం నిల్వ చేయడానికి, సరఫరాలకు వివిధ విభాగాల పరిధిలో లైసెన్సులు కలిగి ఉన్న హోటళ్లకు ఈ రోజుల్లో అమ్మకాలు సాగించడానికి అనుమతి లేదు. పైన పేర్కొన్న కాల వ్యవధిలో వ్యక్తులు మద్యం నిల్వ చేసుకోవడాన్ని అరికట్టాలి. లైసెన్సు లేని ప్రదేశాల్లో మద్యం నిల్వ చేయడంపై నియంత్రణలను పటిష్టంగా అమలు చేయాలి.

## డిలిమిటేషన్‌పై బీజేపీ కుట్రలు అడ్డుకున్నాం: మల్లిఖార్జున ఖర్గే




**హైదరాబాద్ పెన్ పవర్:** డిలిమిటేషన్ తో కలిపి మహిళ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశ పెట్టిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేటి ముగియనుంది. ఈక్రమంలో పార్టీ తరుపున వెలిచారి నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. సదురు బిల్లుపై చర్చించడానికి ఆల్ పార్టీ మీటింగ్‌ను కూడా బీజేపీ తిరస్కరించిందని ఆయన విమర్శించారు. డిలిమిటేషన్ తో పాటు చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును పెట్టి రాజ్యాంగానికి చేటు చేయాలని ప్రమాదకర ఆటలు ఆడుతుందని ఆయన మండిపడ్డారు. జనాభాను విజయవంతంగా నియంత్రించిన తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించడమే దీని అర్థం. ప్రతిపక్షం ఐక్యంగా నిలవగా, ఢిల్లీలోని కాంగ్రెస్ ముందుండి నడిపించిందన్నారు. అలాగే, ఈ బిల్లును ఓడించడానికి డీఎంకే, టీఎంసీ, ఎస్పీ అన్నీ భుజం భుజం కలిపి నిలబడ్డాయని తెలియజేశారు. ఇది ప్రజా వ్యతిరేకమని, దక్షిణాది వ్యతిరేకమని ఆయన అన్నారు. ఇది దేశంలోని ప్రతి పౌరుడి విజయం. ఇది సమాఖ్యవాదానికి, న్యాయానికి లభించిన విజయమన్నారు.

## ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల్లో ఆదిలాబాద్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా ప్రజలెవరూ బయటకు రాకపోవడంతో నగరంలోని రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యమైన పనులు ఉంటే తప్ప నగరవాసులు బయటకు రావడం లేదు. తెలంగాణలో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉన్నది. ఆదిలాబాద్ జిల్లా అయితే ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాను రూపొందించింది. ఆ జాబితాలో ఆదిలాబాద్ 14వ స్థానంలో నిలిచింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతోపాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటంవల్ల మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి

# తమ దౌత్య ప్రతినిధి బృందం పాక్‌కు వెళ్లలేదు: ఇరాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి దఫా చర్చల్లో భాగంగా యూఎస్ ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ బృందం, ఇరాన్ ప్రతినిధుల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. గంటలకు పైగా సాగిన చర్చల్లో అంతిమ ఫలితం తెలలేదు. ఇరువురి డిమాండ్లలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో శాంతి చర్చలు విఫలమైయ్యాయి. చర్చల విఫలానికి కారణం మిరంటే మీరు అని రెండు దేశాలు దుమ్మెత్తి పోసుకున్నాయి. తాజాగా ఇరాన్-యూఎస్‌ల మధ్య రెండు విడత చర్చలపై సందిగ్ధత నెలకొంది. చర్చల కోసం తమ ప్రతినిధులెవ్వరు ఇస్లామాబాద్‌కు వెళ్లలేదని ఇరాన్ పేర్కొంది. ఈ అంశంపై ఎలాంటి వార్తలు వచ్చినా అవి అవాస్తమని ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. "ఇప్పటివరకు ఏ ఇరాన్ దౌత్య ప్రతినిధి బృందం- అది ప్రాథమిక బృందమైనా,
ద్వితీయ బృందమైనా, లేదా తొలి మిషన్ అయినా, తదుపరి మిషన్ అయినా- పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లలేదు. ఎక్స్ వేదికగా పేర్కొందిగత వారం పాక్ వేదికగా జరిగిన మొదటి విడత శాంతి చర్చలు విఫలమైయ్యాయి. యుద్ధ నష్టానికి పరిహారంగా హర్మూజ్ గుండా నౌకల రాకపోకలపై టోల్ ఫీజు వసూలు చేస్తామని ఇరాన్ పట్టుబట్టింది. ఆ డబ్బుతో ఇరాన్ పునర్ నిర్మాణానికి వినియోగిస్తామని ఇరాన్ పేర్కొంది. అంతేకాకుండా లెబనాన్ కూడా కాల్పుల విరమణ ఒప్పందంలోకి వస్తోందని, భవిష్యత్‌లో ఇజ్రాయిల్-అమెరికా పశ్చిమాసియాపై దండెత్త కుండా తగిన హామీ ఇవ్వాలని పేర్కొంది. కానీ అందుకు ట్రంప్ ససేమీరా అంటూ..ఇరాన్ సహజ వనరులపై కన్నేశాడు. ఆ దేశంలో నిల్వ ఉన్నా యురేనియం సంపదను అమెరికా స్వాధీనం చేసుకుంటుందని మొండిపట్టారు. ఓవైపు చర్చలంటూనే ఇరాన్ ఓడరేవులపై దాడులకు తెగబడింది అమెరికా. యూఎస్-ఇజ్రాయిల్ కవ్వింపు చర్యలను ఖండిస్తూ ఇరాన్ చర్చలకు దూరంగా ఉంటుంది.

# చర్చలపై అనిశ్చితి నో అన్న ఇరాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించిన అమెరికా నౌకాదళం తమ దేశానికి చెందిన ఓ కార్గో నౌకపై కాల్పులు జరిపి దానిని స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ మండిపడింది. ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరించింది. నౌకలోని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉన్నారని రూఢ చేసుకున్న తర్వాత దాడులకు దిగుతామని తెలిపింది. ఇరాన్ నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో పాకిస్తాన్‌లో ఆ రెండు దేశాల మధ్య జరగాల్సిన రెండో విడత చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సీనియర్ అధికారులతో కూడిన బృందం చర్చల నిమిత్తం ఇస్లామాబాద్ చేరుకుంది. అయితే చర్చలకు హాజరయ్యే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం రేపటితో ముగుస్తున్న తరుణంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు పశ్చిమాసియాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

అమెరికా దురాక్రమణపై స్పందిస్తాం : ఐఆర్‌జీసీ

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో తన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ భగ్గుమంది. అమెరికా దళాలపై 'అవసరమైన చర్యలు' తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికా దళాల దురాక్రమణపై నిర్ణయాత్మ కంగా స్పందించేం దుకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సిద్ధంగా ఉన్నదని తస్నిమ్ వార్తా సంస్థ తెలియజేసింది. నౌకలో సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఉండడంతో ఇరాన్ ఆచితూచి అడుగులు వేస్తోంది. వారు సురక్షితంగా ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ఉగ్రవాద అమెరికా సైన్యంపై ఐఆర్‌జీసీ అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆ వార్తా సంస్థ తెలిపింది. ఇలాంటి పరిస్థితులలో రెండో విడత చర్చలకు అవకాశమే లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై స్పష్టం చేశారు. ఇరాన్ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో గడువులు, అల్టిమేటంలు విధించడంపై తమకు నమ్మకం లేదని ఆయన చెప్పారు. మరోవైపు...చర్చలపై సందిగ్ధత కొనసాగుతున్నప్పటికీ పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

నీవే...కాదు నీవే

కాల్పుల విరమణ ఒప్పందం గడువు రేపటితో ముగుస్తున్న నేపథ్యంలో దాని ఉల్లంఘనలపై ఇరాన్, అమెరికా పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. 'హోర్ముజ్‌పై బుల్లెట్ దాడి చేయాలని ఇరాన్ నిర్ణయించుకుంది. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తోంది. మేము న్యాయబద్ధమైన, సహేతుకమైన ఒప్పందాన్ని ప్రతిపాదించాం. వారు దానిని అంగీకరిస్తారనే నమ్మకం ఉంది. అలా జరగని పక్షంలో ఇరాన్‌లో ప్రతి విద్యుత్ ప్లాంటును, ప్రతి బ్రిడ్జిని పేల్చివేస్తాం' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆరోపణలు చేశారు. ట్రంప్ ప్రకటనలో ప్రధానంగా రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి...కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించింది. రెండోది...పెద్ద ఎత్తున సైనిక చర్యకు అమెరికా సిద్ధంగా ఉంది. కాగా ట్రంప్ ప్రకటనపై ఇరాన్ దీటుగా స్పందించింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ఓ ప్రకటన చేస్తూ ఇరాన్ ఓడరేవుల దిగ్బంధమే కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు ఉదాహరణ అని తెలిపారు. అమెరికా చర్య చట్టవిరుద్ధమని, అది ఐరాస ఛార్టర్‌కు వ్యతిరేకంగా ఉన్నదని విమర్శించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి చేయి దాటిపోతున్న తరుణంలో ఈ సందేశాలు వెలువడ్డాయి. హోర్ముజ్‌లో నౌకలను అమెరికా దిగ్బంధించినందునే జలసంధిని మూసేశానని ఇరాన్ తెలిపింది. అమెరికా, ఇరాన్ మధ్య ఇస్లామాబాద్‌లో 21 గంటల పాటు జరిగిన సుదీర్ఘ సంప్రదింపులలో కేవలం పరిమిత అవగాహన మాత్రమే సాధ్యపడింది. ఇరాన్ అనేక రాయితీలు కోరడం, అమెరికా పలు డిమాండ్లను ముందుకు తేవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇరాన్‌పై మరింత ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా హోర్ముజ్ దిగ్బంధనం ఎత్తుగడ పన్నింది. అయితే అది ఫలించకపోగా ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఓడరేవుల దిగ్బంధం కొనసాగినంత కాలం పాకిస్తాన్‌కు ప్రతినిధి బృందాన్ని పంపేదే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. 'హోర్ముజ్‌ను తెరిస్తే..ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం కొనసాగితే మేము తప్ప అన్ని దేశాలు వ్యాపారం చేసుకుంటాయి' అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటనపై మండిపడిన ఇరాన్ చర్చల బృందం సభ్యుడు, రాజకీయ విశ్లేషకుడు మహమ్మద్ మరాండీ ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. 'ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుంది. యూఏఈ, బహ్రైన్, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్‌లను వెంటనే విడిచిపొండి. ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగి అన్నింటినీ ధ్వంసం చేస్తుంది' అని తెలిపారు. ఇరాన్ నౌకపై అనేక రౌండ్ల కాల్పులు... స్వాధీనంగల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ ఓడరేవుల దిగ్బంధం ఆదేశాలను ఇరాన్ నౌక ఉల్లంఘించిందని, అందుకే తమ దళాలు దానిపై కాల్పులు జరిపి ఇంజిన్ గదికి నష్టం కలిగించాయని, ఆ తర్వాత మెరైన్లు నౌకను స్వాధీనం చేసుకున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన జరిగింది. కాగా ఇరాన్ పతాకంతో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌ను దాటేందుకు ప్రయత్నించిన నౌకకు చెందిన ఇంజిన్ గదిపై అనేక రౌండ్లు కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. భగ్గుమంటున్న చమురు ధరలుహోర్ముజ్ జలసంధిని ఇరాన్ తిరిగి మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఏడు శాతం పెరిగి 96.88 డాలర్లకు చేరింది. ఇరాన్ కార్గో నౌకను అమెరికా స్వాధీనం చేసుకున్న తర్వాత శాంతి ఒప్పందానికి తలుపులు దాదాపుగా మూసుకుపోయిన నేపథ్యంలో సోమవారం చమురు ధరలు మరింతగా పెరిగాయి. శుక్రవారం నుంచి చమురు ధరలు పెరుగుతూనే ఉండడం గమనార్హం. హోర్ముజ్‌ను తెరుస్తున్నామంటూ ఇరాన్ చేసిన ప్రకటనతో దిగివచ్చిన చమురు ధరలు ఇప్పుడు మళ్లీ పెరుగుతున్నాయి. హోర్ముజ్‌పై నియంత్రణను వదులుకోం : ఇరాన్హోర్ముజ్ జలసంధిపై నియంత్రణను వదులుకునే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అది తమ నుంచి విడదీయరాని హక్కు అని ఐఆర్‌జీసీ మాజీ కమాండర్ ఇబ్రహీం అజిజి చెప్పారు. హోర్ముజ్‌లో నౌకల ప్రయాణంపై ఇరాన్ నిర్ణయం తీసుకుంటుం దని, వాటి రవాణాకు అనుమతులు కూడా ఇస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని చట్టంలో పొందుపరుస్తామని పార్లమెంట్ సభ్యుడు కూడా అయిన అజిజి అన్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీకి కూడా ఆయన నేతృత్వం వహిస్తున్నారు. అమెరికాతో జరుగుతున్న యుద్ధం ఇరాన్‌కు అత్యంత వ్యూహాత్మక జలసంధిని ఓ కొత్త ఆయుధంగా అందించిందని ఆయన చెప్పారు. శత్రువును ఎదుర్కోవడానికి అది ఓ ఆస్తిగా మారిందని తెలిపారు. అమెరికా యుద్ధ నౌకల్లో సైనికుల ఆకలి కేకలుప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యంగా చెప్పుకునే అమెరికా.. ప్రస్తుతం తన సైనికులకు కడుపునిండా తిండి పెట్టలేని పరిస్థితుల్లో చిక్కుకుందని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్, హిందూ మహాసముద్రంలో మోహరించిన యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్, యూఎస్‌ఎస్ ట్రిపోలీ వంటి భారీ యుద్ధనౌకల్లో ఆహార సంక్షోభం తలెత్తిందని, సరిపడా ఆహారం అందక వేలాది మంది సైనికులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. ఈ నౌకల్లోని సైనికులకు అరకొరగా భోజనం అందుతోందని, ట్రేలు దాదాపు ఖాళీగా ఉంటున్నాయని నివేదికలు వస్తున్నాయి. తాజా పండ్లు, కూరగాయల సరఫరా నిలిచిపోవడంతో, కేవలం ఉడికించిన క్యారెట్లు, ప్రాసెస్ చేసిన మాంసంతోనే వారు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ దుస్థితికి సంబంధించిన ఫోటోలు బయటకు రావడంతో సైనికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వెళ్లగక్కుతూ ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

# శాంతి చర్చల ఆశలు.. మార్కెట్లకు ఊపిరి!



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి. మంగళవారం ఉదయం ట్రేడింగ్ (ఱతీఞఅఱఅస్త్ర) ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా (ఖుూా), ఇరాన్ (×తీఞఅ) దేశాల మధ్య శాంతి చర్చలు జరగవచ్చున్న ఆశలు, అంతర్జాతీయంగా తగ్గుతున్న ముడిచమురు ధరలు లాంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. దాంతో సూచీలు పరుగులు తీస్తున్నాయి. సెన్సెక్స్ దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారి 79,000 మార్క్‌ను దాటింది. ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే సెన్సెక్స్ 450 పాయింట్ల లాభంతో 79,000 మార్కును దాటింది. నిఫ్టీ కూడా 135 పాయింట్లు పెరిగి 24,500 మార్కును దాటింది. మధ్యాహ్నం 12 గంటలకు సెన్సెక్స్ 650 పాయింట్లకు పైగా లాభంతో 79,200 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా నిఫ్టీ కూడా 175 పాయింట్లకుపైగా లాభంతో 24,542 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. రంగాల వారీగా చూస్తే రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. అయితే ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఇన్ఫోసిస్, డాక్టర్ రెడ్డీస్ వంటి కొన్ని షేర్లు నష్టాల్లో ఉన్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికాతో శాంతి చర్చలకు హాజరయ్యేందుకు ఇరాన్ సుముఖత చూపుతున్నట్లు వచ్చిన నివేదికలు గ్లోబల్ మార్కెట్లకు ఊతమిచ్చాయి. మరోవైపు సోమవారం నాటి ట్రేడింగ్‌లో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,059.93 కోట్ల విలువైన షేర్లను అమ్మగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,966.89 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 0.93% తగ్గి $94.59కి చేరింది. మార్కెట్‌లో అస్థిరతలు పెరగడం, ఎఫ్ఐఐల అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ఉండగా.. సోమవారం అమెరికా మార్కెట్‌లు స్వల్ప నష్టాలతో ముగిశాయి.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్: లీజింగ్ లావాదేవీల్లో స్వల్ప తగ్గుదల!

## మార్కెట్‌లోకి వచ్చే కొత్త కార్యాలయ స్థలాలూ 36 శాతం తగ్గుముఖం

## ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంపై వెస్టియన్ నివేదిక



ఆఫీస్ స్పేస్‌కు పడిపోతున్న డిమాండ్.. దేశంలో వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులకు అద్దం పడుతున్నది. అమెరికాకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ సోమవారం భారతీయ ఆఫీస్ మార్కెట్‌పై ఓ నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికానికిగాను వచ్చిన ఈ రిపోర్టులో హైదరాబాద్ సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల లీజింగ్ 1 శాతం క్షీణించినట్టు తేలింది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చే ఆఫీస్ స్పేస్ సైతం గతంతో పోల్చితే 36 శాతం తగ్గుముఖం పట్టినట్టు వెస్టియన్ పేర్కొన్నది.జఅఎ ఛ

**21.53 మి.చదరపు అడుగులు**

హైదరాబాద్, ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, బెంగళూరు, పుణె, కోల్‌కతా నగరాల్లో ఈ జనవరి–మార్చిలో 21.53 మిలియన్ చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగినట్టు వెస్టియన్ వెల్లడించింది. అంతకుముందు త్రైమాసికం (2025 అక్టోబర్–డిసెంబర్)తో చూస్తే ఇది 1 శాతం తక్కువ. అలాగే మార్కెట్‌లోకి ఈ మార్చితో ముగిసిన 3 నెలల కాలంలో కొత్తగా 9.70 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ మాత్రమే అందుబాటులోకి వచ్చింది. మునుపటితో పోల్చితే 36 శాతం పతనమైంది. కాగా, ఏడాది ప్రాతిపదికన మాత్రం ఆఫీస్ స్పేస్ లీజింగ్ 20 శాతం, కొత్త సరఫరా 2 శాతం పెరిగినట్టు వెస్టియన్ పేర్కొన్నది. ఈ క్రమంలోనే 'భారతీయ ఆఫీస్ మార్కెట్ ఇప్పటికీ బాగానే ఉన్నది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక–రాజకీయ సవాళ్ల ప్రభావం లేదు' అని వెస్టియన్ సీఈవో శ్రీనివాస రావు అన్నారు.

**హైదరాబాద్‌లో..**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత దాదాపు పదేండ్లపాటు హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ హాట్‌కేకుల్లా అమ్ముడుపోయింది. అన్ని రంగాల వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు పోటీపడ్డారు. విస్తరణ దిశగా అడుగులు వేశారు. అయితే అప్పటితో పోల్చితే ఇప్పుడు ఆ స్థాయిలో జోరు కనిపించడం లేదు. నిజానికి నాడు మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులున్నా.. వాటిని అధిగమించి అన్ని నగరాల్లోని అవకాశాలను ఛ

హైదరాబాద్ అందిపుచ్చుకున్నది. కానీ నేడు ఆ రకమైన ఆకర్షణ, వాతావరణం ఇక్కడ లేదన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ, రియల్టీ వర్గాలతోపాటు సర్వత్రా వ్యక్తమవుతుండటం గమనార్హం. మొత్తానికి నిర్మాణ రంగంలో ఈ నిస్తేజం ఇలాగే కొనసాగితే.. అనుబంధ రంగాలూ కునారిల్లడం ఖాయమే అంటున్నారంతా.

# ముందుంది.. డీజిల్ ధరల వాత!

## ఎన్నికలయ్యాక పెరగొచ్చని ట్రక్కు యజమానుల అంచనా

## పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం



ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. ఉద్రిక్తతలకు ముందు బ్యారెల్ చమురు ధర 70 డాలర్ల లోపు ఉండగా.. ప్రస్తుతం 95 డాలర్ల సమీపంలో ఉంది. ఇటీవల 100 డాలర్లు మించింది కూడా. మన దేశీయ చమురు అవసరాల్లో 85% పైగా దిగుమతులే తీరుస్తున్నందున, అధిక ధరల ప్రభావం ఇప్పటికే కనపడుతోంది. దిగుమతుల బిల్లు పెరుగుతుండటంతో.. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇది అవరోధంగా నిలవొచ్చు. అయితే ముడిచమురు ధర పెరిగినా, పెట్రోల్–డీజిల్ రిటెయిల్ ధరలను ఇప్పటివరకు ప్రభుత్వం పెంచలేదు. ఫలితంగా ఇంధన రిటెయిల్ విక్రయ సంస్థలు నష్టపోతున్నాయి. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించినా, ఆ రూపేణ ఈ సంస్థలకు కలిగే ఉపశమనం స్వల్పమే అంటున్నారు. ప్రస్తుత పరిస్థితి మున్ముందూ కొనసాగకపోవచ్చని.. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తయ్యాక (ఈనెల 29).. పెట్రోలు, డీజిల్ ధరలను పెంచొచ్చనే ఆందోళనలు వాహన యజమానుల్లో ఉన్నాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్ లాంటి కీలక రాష్ట్రాల ఎన్నిక పూర్తయ్యేవరకే, పెట్రో ధరల పెంపును కేంద్ర ప్రభుత్వం వాయిదా వేస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ అంచనాలే నిజమై పెట్రోలు, డీజిల్ ధరలను ఇంధన రిటెయిల్ సంస్థలు పెంచితే.. నాలుగేళ్లలోనే ఇది తొలిసారి అవుతుంది. ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరిగి.. ఆర్థిక వ్యవస్థపైనా భారం పడే అవకాశం ఉంది.

**విక్రయాల్లో పరిమితులు..**

ఇప్పటికే కొన్ని పెట్రోలు బంకుల్లో.. ఒక్కో ట్రక్కుకు ఇంత డీజిల్ మాత్రమే నింపుతామని అనధికారిక పరిమితులు ఉంటున్నాయని ట్రక్కుల యజమానుల సంఘాలు చెబుతున్నాయి. దీంతో తరచు పెట్రోలు బంకుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని.. పైగా క్యూలైన్లు పెద్దగా ఉంటుండటంతో, సరకు రవాణాలో జాప్యం జరుగుతోందని అంటున్నాయి. సరఫరాలు తక్కువగా ఉండటమే ఈ పరిస్థితికి కారణమంటున్నారు. ఎన్నికలయ్యాక డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శైలేంద్ర గుప్తా పేర్కొంటున్నారు. సరఫరాలు లేక ఇప్పటికే 10% ట్రక్కులు నిలిచిపోగా, డీజిల్ ధర పెరిగితే ఈ సంఖ్య 30 శాతానికి చేరొచ్చని అంచనా వేశారు. నెలవారీ డీజిల్ కొనుగోళ్లపై ఇచ్చే డిస్కౌంట్లను కూడా పెట్రోలు బంకులు ప్రస్తుతం ఆపేశాయని వెల్లడించారు.

**అసాధారణ గిరాకీ అందుకే..**

దేశంలో సరకు రవాణా అత్యధికంగా రోడ్డు మార్గంలోనే జరుగుతోంది. ఇందులో ట్రక్కుల ద్వారా జరిగే రవాణానే 70 శాతమని చెబుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు డీజిల్ ఎంత కీలకమో ఇది తెలియజేస్తోంది. ప్రైవేట్ రంగ చమురు విక్రయ సంస్థలైన నయారా ఎనర్జీ ఇప్పటికే ఇంధన ధరలు పెంచగా..రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య సంస్థ బీపీ బంకులు మాత్రం పెట్రో విక్రయాల్లో పరిమితులు విధిస్తున్నాయని సమాచారం. ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు ఇలాంటి పరిమితులేవీ ఇప్పటివరకు విధించడంలేదని ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అజయ్ బన్సాల్ చెప్పారు. ప్రైవేట్ బంకుల్లో పరిమితుల వల్ల.. ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థల బంకులకే వాహనాలు దారితీస్తున్నాయి. దీంతో కొన్ని బంకుల్లో పెట్రోలు, డీజిల్ నిల్వలు అయిపోతున్నాయని బన్సాల్ వివరించారు.

**ఎంత పెరగొచ్చంటే..**

స్టాండర్డ్ చార్టర్డ్ ఆర్థికవేత్తల అంచనా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు బ్యారెల్ ధర సగటున 95 డాలర్లుగా ఉంటే, పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధరలను లీటరుకు రూ.8–15 వరకు పెంచే అవకాశం ఉంది. బ్యారెల్ చమురు ధర సగటున 85–90 డాలర్ల మధ్య కదలాడినా, ఇంధన రిటెయిల్ ధరలను లీటరుకు రూ.3–7 వరకు పెంచొచ్చని భావిస్తున్నారు. వంట గ్యాస్ సిలిండర్ ధర మరింత పెరగొచ్చు.

# బీవోఎం లాభం 2,014 కోట్లు




ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) అంచనాలకు మించి రాణించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.2,014 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,493 కోట్ల లాభంతో పోలిస్తే 35 శాతం ఎగబాకినట్టు బ్యాంక్ వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.7,711 కోట్ల నుంచి రూ.8,693 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.6,731 కోట్ల నుంచి రూ.7,755 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.74 శాతం నుంచి 1.45 శాతానికి దిగొచ్చాయని పేర్కొంది. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 0.18 శాతం నుంచి 0.13 శాతానికి తగ్గాయి.

# సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్‌గా పిచ్చయ్య బాధ్యతలు

ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ హెడ్‌గా జనరల్ మేనేజర్ పిచ్చయ్య ఎం బాధ్యతలు స్వీకరించారు. 1993లో బ్యాంకులో చేరిన ఆయనకు మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని ఏడు రీజియన్ల కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించనున్నారు. బ్యాంక్ వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా ఈ జోన్‌లో బ్యాంకింగ్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పిచ్చయ్య ఎం తెలిపారు.

# వెండి వెలుగులు.. రూ.4,300 పెరిగిన కిలో ధర



బంగారం, వెండి మళ్లీ పరుగులు పెట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు నిలకడగా ఉన్నప్పటికీ దేశీయంగా రిటైలర్లు, స్టాకిస్టులు అధికంగా కొనుగోలు జరపడంతో ధరలు భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి ఏకంగా రూ.4,300 ఎగబాకి రూ.2,57,300కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.2.53 లక్షలుగా ఉన్నది. వెండితోపాటు బంగారం కూడా అధికమైంది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.800 అందుకొని రూ.1.57 లక్షలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ వెండి 1.09 డాలర్లు లేదా 1.35 శాతం తగ్గి 79.71 డాలర్లకు పడిపోగా, బంగారం 4,805.09 డాలర్లకు చేరుకున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటం, పలు దేశాల ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకపోవడంతో పసిడికి డిమాండ్ పడిపోయిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

# ప్రధాని మోడీపై ఈసీకి 700 మంది కంప్లయింట్..!



పార్లమెంట్ లో మహిళా కోటా బిల్లు వీగిపోయిన తర్వాత ప్రధాని మోడీ జాతినుద్దేశించిన చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ప్రధాని ప్రసంగం ఎన్నికల నియమావళిని ఉల్లఘించడమే అని 700 మంది కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు లో ఉండగా.. అధికారిక మీడియాలో ప్రధాని మోడీ ప్రసంగించడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది.. చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ 700 మందికి పైగా పౌరులు ఈసీకి లెటర్ రాశారు. ఏప్రిల్ 23న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లలో ఎన్నికలు జరగనున్నాయి.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు అమలులో ఉండగా దూరదర్శన్, సంసద్ టీవీ, ఆల్ ఇండియా రేడియో వంటి అధికారిక మీడియాలో మోడీ ప్రసంగం చేయడం ఎన్రికల ప్రచారం కిందకే వస్తుందని తమ ఫిర్యాదులో ఈసీకి తెలిపారు.

# అరటిపండు, నారింజ: ఏది తింటే ఆరోగ్యానికి మంచిది..?




చాలామంది ఉదయం నిద్రలేవగానే తక్షణ శక్తి కోసం ఏదో ఒక పండు తింటుంటారు. అయితే అల్పాహారంలో అరటిపండు తీసుకోవాలా లేక నారింజ పండు తీసుకోవాలా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ఈ రెండు పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, వీటిని ఎప్పుడు, ఎలా తినాలో తెలిస్తేనే పూర్తి ప్రయోజనాలు అందుతాయి. తక్షణ శక్తికి అరటిపండు: అరటిపండులో కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణమే గ్లూకోజ్‌ను అందించి, రోజంతా ఉత్సాహంగా ఉండటానికి సహాయపడతాయి. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియ: అరటిపండులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఖాళీ కడుపుతో కేవలం అరటిపండును మాత్రమే తింటే కొంతమందిలో కడుపు ఉబ్బరం రావచ్చు. అందుకే వీటిని నట్స్ లేదా ఇతర ఆహారాలతో కలిపి తీసుకోవడం ఉత్తమం. రోగనిరోధక శక్తికి నారింజ: నారింజలో సుమారు 87 శాతం నీరు ఉంటుంది. రాత్రంతా నిద్రపోయి లేచిన తర్వాత డీహైడ్రేషన్‌కు గురైన శరీరానికి ఇది మంచి తేమను అందిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. అలాగే చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. ఎసిడిటీ ముప్పు: నారింజలో ఆమ్ల గుణం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి గ్యాస్ట్రిక్ లేదా ఎసిడిటీ సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నారింజ లేదా దాని రసాన్ని తీసుకోకపోవడమే మంచిది. అల్పాహారం పూర్తిగా తిన్న తర్వాత నారింజ పండును తీసుకోవడం ఆరోగ్యకరం. ఏది బెస్ట్: మీరు ఉదయం వర్కౌట్స్ చేసే వారైతే తక్షణ శక్తి కోసం అరటిపండు ఉత్తమ ఎంపిక. అలా కాకుండా, శరీరానికి విటమిన్-సి, హైడ్రేషన్ అవసరం అనుకుంటే అల్పాహారం తర్వాత నారింజ తీసుకోవడం మంచిది. అయితే ఏ పండు తిన్నా, అది అతిగా కాకుండా మితంగా తీసుకున్నప్పుడే ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుంది.

# ఈ వాటర్ ఆరోగ్యానికి అమృతం!



భారతీయ వంటగదిలో మెంతులకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే వీటిని ఒక పద్ధతి ప్రకారం తీసుకుంటే అది ఖరీదైన మందుల కంటే బాగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుందని అంటున్నారు. మన వంటింట్లో సులభంగా దొరికే మెంతులలో అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. మెంతులు కేవలం పోపు దినుసులే కాకుండా, ఆయుర్వేదంలో గొప్ప ఔషధంగా పరిగణించబడతాయి. మెంతులను నేరుగా తీసుకోవడం కంటే, నానబెట్టి తీసుకోవడం వల్ల వాటిలోని పోషకాలు శరీరానికి మరింత సమర్థవంతంగా అందుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మెంతులలో ఉండే గెలాక్టోమన్నన్ అనే మూలకం రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. మెంతులలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. నానబెట్టిన మెంతులు తీసుకోవడం వల్ల మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గి జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఉదయాన్నే మెంతులు తీసుకోవడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది. మెంతులలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ముఖంపై ముడతలను తగ్గిస్తాయి. జుట్టు రాలడం తగ్గి, కుదుళ్లు బలంగా మారడానికి ఇవి సహాయపడతాయి. శరీరంలోని ఎల్‌డీఎల్ లేదా చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మెంతులు కీలక పాత్ర పోషిస్తాయి, తద్వారా గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ఎలా తీసుకోవాలి?: ఒక స్పూన్ మెంతులను రాత్రిపూట ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపున ఆ నీటిని తాగి, నానబెట్టిన మెంతులను నమిలి తినాలి. మెంతులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ, గర్భిణీ స్త్రీలు లేదా ఏదైనా దీర్ఘకాలిక వ్యాధుల కోసం మందులు వాడుతున్న వారు వైద్యుని సలహా మేరకు మాత్రమే వీటిని తీసుకోవడం మంచిది. సహజమైన పద్ధతిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మెంతులు ఒక చౌకైన, శక్తివంతమైన మార్గం.

# గోళ్లలో దాగిన క్యాన్సర్ రహస్యం



గోళ్ళ క్లబ్బింగ్ ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఒక ముఖ్యమైన ప్రారంభ సూచన కావచ్చు. దగ్గు, ఛాతీ నొప్పి వంటి సాధారణ లక్షణాలకు ముందు, గోళ్లలో వచ్చే చిన్న మార్పును క్లబ్బింగ్ అంటారు. గోళ్లు సాధారణంగా నునుపుగా, గులాబీ రంగులో ఉంటాయి. గోరు, గోరు గది మధ్య కోణం మారితే లేదా కలిపినప్పుడు డైమండ్ ఆకారం కనిపించకపోతే అది క్లబ్బింగ్. ఈ మార్పును సులభంగా గుర్తించడం ద్వారా ప్రారంభ దశలోనే వైద్య సలహా పొందవచ్చు. సాధారణంగా గోళ్లు మన అంతర్గత ఆరోగ్యం ఎలా ఉందో సూచించే ఒక కిటికీ లాంటివి. చాలా మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను గుర్తించేందుకు దగ్గు, ఛాతీ నొప్పి లేదా బరువు తగ్గడం వంటి లక్షణాలను పరిగణనలోకి తీసుకుంటారు. అయితే, గోళ్లలో కనిపించే ఒక చిన్న మార్పు, క్లబ్బింగ్ అని పిలవబడేది, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి తీవ్రమైన పరిస్థితులకు సంబంధించిన ఒక ప్రారంభ హెచ్చరిక సంకేతం కావచ్చని మీకు తెలుసా?. సాధారణ గోళ్లు నునుపుగా, గులాబీ రంగులో, గోరు అంచున చిన్న అర్ధచంద్రాకార ఆకారంతో (లెన్యూలా) ఉంటాయి. అయితే, గోరు స్ట్రెయిట్‌గా కాకుండా ఒక వంపును తీసుకున్నప్పుడు, అది క్లబ్బింగ్‌గా పరిగణించబడుతుంది. క్లబ్బింగ్‌కు అత్యంత సాధారణ కారణాలలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటిగా చెప్పబడుతుంది. క్లబ్బింగ్‌ను ఎలా గుర్తించవచ్చంటే.. మన గోరుకు, నెయిల్ బెడ్‌కు మధ్య సాధారణంగా ఒక కోణం ఉంటుంది. ఈ కోణం పెరిగినప్పుడు అది క్లబ్బింగ్ అవుతుంది. క్లబ్బింగ్ ఉందా లేదా అని సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. మీ రెండు వేళ్లను కలిపి, మధ్యలో ఒక చిన్న డైమండ్ ఆకారం కనిపిస్తే, అది సాధారణమైన గోరు. ఆ కోణం గనక పోయి, డైమండ్ ఆకారం కనిపించకపోతే, అది క్లబ్బింగ్ అని అర్థం. ఇటువంటి మార్పులను గుర్తించినప్పుడు, తదుపరి వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

# జామ అకులతో డయాబెటీస్‌కు చెక్!



పంటి నొప్పి, చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన.. ఈ సమస్యలకు ఖరీదైన మౌత్ వాష్‌లే పరిష్కారం అనుకుంటున్నారా..? అయితే మీరు పొరబడినట్లే.. మన పెరట్లోనే దొరికే జామ ఆకులతో వీటన్నింటికీ చెక్ పెట్టవచ్చు. కేవలం నోటి ఆరోగ్యమే కాదు, డయాబెటిస్ నుంచి చర్మ సౌందర్యం వరకు జామ ఆకులు చేసే మేలు అంతా ఇంతా కాదు. మన పెరట్లో కనిపించే జామ చెట్టు కేవలం రుచికరమైన పండ్లనే కాదు, అమూల్యమైన ఔషధ గుణాలున్న ఆకులను కూడా అందిస్తుంది. ఖరీదైన మందులు, మౌత్ వాష్‌లకు బదులుగా రోజుకు రెండు జామ ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం నుండి డయాబెటిస్ నియంత్రణ వరకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు, పంటి నొప్పితో బాధపడేవారికి జామ ఆకులు ఒక వరం. వీటిలోని యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలోని బ్యాక్టీరియాను చంపేస్తాయి. చిగుళ్ల నుండి రక్తం కారడం, వాపు ఉన్నప్పుడు లేత జామ ఆకులను నమలడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జామ ఆకులను నమలడం వల్ల వచ్చే రసం మీ జీర్ణవ్యవస్థను శుద్ధి చేస్తుంది. ఇది గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడమే కాకుండా, శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపుతుంది. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం.. జామ ఆకుల సారం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా భోజనం తర్వాత గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇది సహాయపడుతుంది. కొవ్వు నిరోధకం: కార్బోహైడ్రేట్లు చక్కెరగా మారి శరీరంలో కొవ్వుగా పేరుకుపోకుండా జామ ఆకులు అడ్డుకుంటాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికి గొప్ప చిట్కా. వీటిలోని విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గించి, సహజమైన మెరుపును అందిస్తాయి. రోజుకు 2 నుండి 3 లేత జామ ఆకులను శుభ్రంగా కడిగి నమలడం సరిపోతుంది. అయితే గర్భిణీ స్త్రీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు మందులు వాడుతున్న వారు, వీటిని వాడే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. అతి తక్కువ ఖర్చుతో, సహజసిద్ధంగా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ అలవాట్లలో జామ ఆకులను చేర్చుకోవడం ఒక ఉత్తమ మార్గం.

# బ్లాక్ కాఫీతో కేలరీలు మంచులా కరిగిపోవాలా?





నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత పెరిగింది. బరువు తగ్గడం కోసం డైట్ చేసేవారు, జిమ్‌కు వెళ్లేవారు ఎక్కువగా 'గ్రీన్ టీ' లేదా 'బ్లాక్ కాఫీ'ని ఆశ్రయిస్తుంటారు. ఈ రెండూ కూడా తక్కువ కేలరీలు కలిగి ఉండి, శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తాయి. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి రక్షణగా నిలిస్తే, బ్లాక్ కాఫీలోని కెఫీన్ తక్షణ శక్తిని అందిస్తుంది. ఒకటి పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును నిదానంగా కరిగిస్తే, మరొకటి వ్యాయామం చేసే సమయంలో మీ శారీరక సామర్థ్యాన్ని పెంచుతుంది. ముఖ్య పదార్థం: ఇందులో ఇఉఅఉ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది వ్యాయామం చేసేటప్పుడు కొవ్వు కణాలను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడుతుంది. కెఫీన్: ఇందులో కెఫీన్ తక్కువగా ఉండటం వల్ల గుండెపై ఒత్తిడి పడదు. ఎసిడిటీ సమస్య ఉన్నవారికి ఇది ఉత్తమ ఎంపిక. ప్రయోజనం: ఇది నిదానంగా కానీ, దీర్ఘకాలికంగా బరువు తగ్గడానికి మరియు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి తోడ్పడుతుంది.

2. బ్లాక్ కాఫీ: ముఖ్య పదార్థం: ఇందులో కెఫీన్ అధికంగా ఉంటుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రేరేపించి, మెటబాలిజంను 3-11% వరకు వేగవంతం చేస్తుంది. శక్తి ప్రదాత: వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగడం వల్ల శక్తి స్థాయిలు పెరిగి, ఎక్కువ సేపు వర్కౌట్ చేసే సామర్థ్యం వస్తుంది. ఆకలి నియంత్రణ: ఇది ఆకలిని కలిగించే హార్మోన్లను తాత్కాలికంగా అణచివేస్తుంది, దీనివల్ల తక్కువ ఆహారం తీసుకుంటారు. ఏది ఎంచుకోవాలి? మీరు వేగంగా కేలరీలను దహించాలనుకుంటే: బ్లాక్ కాఫీ ఉత్తమం. ఇది విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేలా చేస్తుంది. మీకు ఎసిడిటీ లేదా నిద్రలేమి సమస్యలు ఉంటే: గ్రీన్ టీ సురక్షితమైన మార్గం. ఇది శరీరాన్ని నిర్విషీకరణ (ఆవబినీలీ) చేయడంలో కూడా మేలు చేస్తుంది. ఏది తాగినా పరిమితంగా తీసుకోవడం ముఖ్యం. బ్లాక్ కాఫీని మరీ రాత్రిపూట తాగడం వల్ల నిద్రకు భంగం కలగవచ్చు. మీ జీవనశైలికి మరియు మీ శరీర అవసరాలకు అనుగుణంగా సరైన పానీయాన్ని ఎంచుకుని, క్రమబద్ధమైన వ్యాయామంతో మీ ఫిట్‌నెస్ లక్ష్యాలను చేరుకోండి.

# ఫాస్ట్ ఫాస్ట్‌గా తింటున్నారా..? బాడీ షెడ్డుకే..



నేటి వేగవంతమైన జీవితాల్లో, ప్రజలు త్వరగా తినే అలవాటును అలవర్చుకుంటున్నారు.. కానీ ఈ అలవాటు వారి ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఇది ఊబకాయం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. త్వరగా తినే అలవాటు మన ఆరోగ్యానికి ఎలా హాని కలిగిస్తుంది..? నేటి వేగవంతమైన జీవితంలో, ప్రజలు తినడంతో సహా ప్రతీదాన్ని త్వరగా ముగించాలని ప్రయత్నిస్తారు. ఆఫీసుకు పరుగెత్తడం, మొబైల్ ఫోన్‌ను అధికంగా వాడటం, సమయ పరిమితులు తరచుగా ప్రజలను తొందరగా, శ్రద్ధ పెట్టకుండా తినేలా చేస్తాయి. చాలాసార్లు, ప్రజలు పని చేస్తూ లేదా స్క్రీన్‌ను చూస్తూ తమ భోజనాన్ని ముగించేస్తారు. ఇది వారు తీసుకునే ఆహారం పరిమాణం, నాణ్యత రెండింటినీ ప్రభావితం చేస్తుంది. ఈ అలవాటు క్రమంగా శరీరంపై ప్రతికూల ప్రభావం చూపడం ప్రారంభిస్తుంది. చాలా వేగంగా తినడం వల్ల శరీరానికి కడుపు నిండినట్లు సరైన సంకేతం అందదు.. ఇది అతిగా తినడానికి దారితీస్తుంది. అందుకే ఇలాంటి వ్యక్తులలో ఊబకాయం వచ్చే ప్రమాదం వేగంగా పెరుగుతోంది. అంతేకాకుండా, ఈ అలవాటు కాలక్రమేణా తినే విధానాలను దెబ్బతీసి, శరీరం శక్తి, ఓర్పును ప్రభావితం చేస్తుంది. ఈ అలవాటు ఎక్కువ కాలం కొనసాగితే, అది అనేక తీవ్రమైన అనారోగ్యాలకు దారితీయవచ్చు. ఆర్ఎంఎల్ హాస్పిటల్ లోని వైద్య విభాగం డైరెక్టర్ అయిన ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి.. వేగంగా తినే అలవాటు కేవలం ఊబకాయానికే పరిమితం కాదని, అది శరీరంలోని అనేక భాగాలను ప్రభావితం చేస్తుందని వివరిస్తున్నారు. ఈ అలవాటు జీర్ణక్రియ ప్రక్రియకు ఆటంకం కలిగించి, మలబద్ధకం, కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా, ఇన్సులిన్ స్థాయిలలో అంతరాయం కలగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. వేగంగా తినే వ్యక్తులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని కూడా తేలింది. ఎందుకంటే వారు తరచుగా తమకు అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలను తీసుకుంటారు. అంతేకాకుండా, జీవక్రియ మందగించి, శరీరంలో కొవ్వు పేరుకుపోవడానికి దారితీయవచ్చు. దీర్ఘకాలంలో, ఈ అలవాటు హార్మోన్ల అసమతుల్యత, అలసట వంటి సమస్యలను కూడా పెంచుతుంది. ఈ అలవాటును నివారించుకోవడానికి, తినేటప్పుడు ఏకాగ్రత, ఓర్పును పాటించడం చాలా ముఖ్యం. ఆహారాన్ని బాగా నమిలి, నెమ్మదిగా తినండి. దీనివల్ల మీ శరీరానికి సరైన సమయంలో కడుపు నిండినట్లు సంకేతం అందుతుంది. టీవీ లేదా మొబైల్ ఫోన్ చూస్తూ తినడం మానుకోండి.. ఎందుకంటే ఇది మీ ఏకాగ్రతను దెబ్బతీసి, అతిగా తినడానికి దారితీస్తుంది. భోజనాల మధ్య చిన్న విరామాలు తీసుకోవడం, కొద్ది మొత్తంలో నీరు త్రాగడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. క్రమమైన సమయాల్లో భోజనం చేయడం, ప్లేట్‌లో ఆహారాన్ని పరిమితం చేసుకోవడం కూడా ఈ అలవాటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే, మీరు ఏమి తింటున్నారు.. అనేదే కాదు, ఎలా తింటున్నారు అనేది కూడా ముఖ్యం. పండ్లు, కూరగాయలు,

ప్రోటీన్, ఫైబర్ ఉండేలా ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోండి. భోజనానికి ఒక నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించుకుని, దానికి కట్టుబడి ఉండండి. రోజంతా పుష్కలంగా నీరు త్రాగండి.. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి. అలాగే, మీ జీవక్రియను మెరుగుపరచుకోవడానికి మీ దినచర్యలో క్రమం తప్పని వ్యాయామాన్ని చేర్చుకోండి. మీ ఆరోగ్యానికి తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా చాలా అవసరం. ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా మీరు చాలా కాలం పాటు ఆరోగ్యంగా, దృఢంగా ఉండగలరు.

# చాహల్‌తో డేటింగ్ పుకార్లు ఫేక్.. కోహ్లీ లాంటి అబ్బాయి కావాలన్న యాంకర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో బిగ్ బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కలిసి ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో, వీరిద్దరు డేటింగ్ చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా ఊపందుకుంది. ఈ తప్పుడు ప్రచారంపై షెఫాలీ బగ్గా సోషల్ మీడియాలో తనపై వస్తున్న డేటింగ్ వార్తలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా క్రికెటర్లతో తనని ముడిపెడుతూ వస్తున్న గాసిప్స్ పై తీవ్రంగా మండిపడింది. ప్రజల ఆలోచనా విధానం మరీ చిన్నదిగా ఉంది. ఒక డిన్నర్‌కు వెళ్తే అది డేటింగ్ అని ఎలా అనుకుంటారు? ఇలాంటి చిన్నచూపుతో నేను విసిగిపోయాను.. వాస్తవం ఏంటో నాకు, నా ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది.

### నా వ్యక్తిగత జీవితం వేరు!:

క్రికెటర్లతో రిలేషన్‌షిప్‌పై ఆమెకు స్పష్టమైన అభిప్రాయం ఉంది. ఇది నా వృత్తి (గాతీశీటవంంఱశీఅ).. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు.. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన లేదని షెఫాలీ బగ్గా తేల్చి చెప్పింది.

### కోహ్లీ లాంటి 'పర్ఫెక్ట్ పార్ట్నర్' కావాలి!:

తనకు కాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరిస్తూ, విరాట్ కోహ్లీ – అనుష్క శర్మ జంటను ఉదాహరణగా చూపించారు. విరాట్ ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ఆ అంకితభావం, ఆరాధన తనకు ఇష్టమని ఆమె పేర్కొన్నారు. తన భాగస్వామి తనతో ఉన్నప్పుడు పూర్తిగా తనకే సమయం కేటాయించాలని, తనపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలని ఆకాంక్షించింది. లగ్జరీల కంటే ప్రేమించే మనసు, తనను కేర్ చేసే గుణం ఉంటే చాలని షెఫాలీ బగ్గా వెల్లడించింది.

### కెరీర్‌పైనే ఫోకస్!:

ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే తన కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు షెఫాలీ బగ్గా వెల్లడించారు. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక లీగ్స్‌లో యాంకర్‌గా రాణిస్తున్న షెఫాలీ, త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

# ఐపీఎల్ తర్వాత టీమిండియా బీజీ షెడ్యూల్.. బీసీసీఐ తీరుపై గంభీర్, గిల్ అసంతృప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ ఫైనల్ మే 31వ తేదీతో ముగియనుంది. అనంతరం భారత జట్టు వరుస సిరీస్ లతో బిజిబిజీగా ఉండనుంది. తీరిక లేకుండా మ్యాచ్ ల షెడ్యూల్ రూపొందించడంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బీసీసీఐ (భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు)పై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. జూన్ 6 నుంచి -10 మధ్య ముల్లాన్ పూర్ లో భారత్, అఫ్గానిస్థాన్ మధ్య టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్లతో ఎలాంటి సంబంధం లేదు. దీంతో అగ్రశ్రేణి ప్లేయర్స్ కి రెస్ట్ ఇచ్చి యంగ్ క్రికెటర్స్ ని బరిలోకి దింపాలని టీమిండియా మేనేజ్మెంట్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. జస్ ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా లాంటి సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. ఫస్ట్–క్లాస్ క్రికెట్ లో ఆకట్టుకున్న గుర్నూర్ బ్రార్, మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, దేవదత్ పడిక్కల్ వంటి ప్లేయర్స్ ని అఫ్గానిస్థాన్ తో టెస్టు మ్యాచుకి సెలక్ట్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు బీసీసీఐ అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్ 2026 ముగియగానే టీమిండియా వరుస సిరీస్ లతో తీరిక లేకుండా క్రికెట్ ఆడనుంది. జూన్ మాసంలో అఫ్గానిస్థాన్ తో టెస్టు మ్యాచ్, మూడు వన్డేలని ఆడబోతుంది. తర్వాత రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్ టూర్ కి వెళ్లనుంది. ఇక జులై నెలలో ఇంగ్లాండ్ గడ్డపై పర్యటించి ఆతిథ్య జట్టుతో ఐదు వన్డేలు, 3 టీ20 మ్యాచుల్లో తలపడనుంది. అలాగే జులై 23వ తేదీ నుంచి జింబాబ్వే, టీమిండియా మధ్య మూడు టీ20ల సిరీస్ స్టార్ట్ కానుంది. దీంతో వరుస సిరీస్ లతో ఆటగాళ్లు తీవ్రంగా ఇబ్బంది పడతాడంతో పాటు జట్టులో గాయాల బెడద పెరిగే ఛాన్స్ ఉందని కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ పేర్కొన్నట్లు తెలుస్తుంది.

# సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్... ఢిల్లీపై అద్భుత విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది.ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# ఇండియన్ సినిమా కింగ్ ఎవరో తేలిపోనుందా?

ఇండియన్ సినిమా కింగ్ ఎవరో తేలిపోనుందా?..దీనికి డిసెంబర్ సాక్ష్యంగా నిలవబోతోందా? అంటే ట్రేడ్ వర్గాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. వివరాల్లోకి వెళితే...పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ పీరియాడిక్ వార్ డ్రామా -ఫౌజీ-. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఇమాన్వి



**డెనిమ్ లుక్‌లో డెనిమ్‌లో అప్రయత్నంగా స్టైల్‌తో స్టన్‌లు చేసిన ప్రకృతి పావని**





కథానాయికగా పరిచయం అవుతుండగా కీలక పాత్రల్లో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భాను చందర్, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె అచర్, ప్రవీణ్ దాచారం నటిస్తున్నారు. 1932 నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ వార్ డ్రామా ఇది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నాడు. దేశ భక్తి ప్రధానంగా సాగే రొమాంటిక్ వార్ యాక్షన్ డ్రామాగా దీన్ని ఓ ఫీల్ గుడ్ స్టోరీగా అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి సుదీప్ చటర్జీ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు. భారీ క్యాన్వాస్‌పై మునుపెన్నడూ చూడని వార్ ఎక్స్ పీరియన్స్‌ని ఈ సినిమాతో అందించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రభాస్ లుక్స్ సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. -సీతారామం- వంటి వార్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ ఫీల్ గుడ్ లవ్ స్టోరీని అందించిన టాలీవుడ్ మణిరత్నం అంటూ ప్రశంసలు అందుకున్న హను రాఘవపూడి ఈ మూవీని కూడా అంతకు మించిన స్థాయిలో తెరపై ఆవిష్కరిస్తున్నారు. ముందు ఈ సినిమాని ఆగస్టు 15న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ డిసెంబర్‌కే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఇన్ సైడ్ టాక్. అదే నిజమైతే షారుక్ ఖాన్ -కింగ్-కు భారీ ఝలక్ తప్పదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. షారుక్ ఖాన్ నటిస్తున్న యాక్షన్ డ్రామా -కింగ్-. సిద్ధార్థ్ ఆనంద్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని డిసెంబర్ 24న భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవడం షారుక్‌కు చాలా అవసరం. అయితే ఇదే సమయంలో ప్రభాస్ -ఫౌజీ- రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. -ధురంధర్ 2- తరువాత సెంటిమెంట్‌లు పతాక స్థాయికి చేరడం, భారతీయుల భావోద్వేగాలకు ప్రధాన ప్రియారిటీ ఇచ్చే అవకాశం ఉండటంతో -కింగ్-కు భారీ ఝలక్ తగిలే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. గతంలో షారుక్ -డంకీ- టైమ్‌లో ప్రభాస్ సలార్-తో బరిలోకి దిగి విక్టరీని సాధించడం తెలిసిందే. ఈ దఫా మళ్లీ షారుక్, ప్రభాస్‌ల మధ్య ఆసక్తికరమైన పోటీ ఏర్పడే అవకాశం ఉందని, ఈ పోటీలో -ఫౌజీ-తో ప్రభాస్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్‌ని దక్కించుకుని షారుక్‌ని వెనక్కి నెట్టి ఇండియన్ సినిమా కింగ్‌గా నిలిచే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలతో పాటు సినీ విమర్శకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ప్రభాస్ ఇండియన్ బాక్సాఫీస్ -కింగ్-గా నిలవడం లాంఛనమే.



**ధనశ్రీ వర్మ గ్రేస్‌ని మినిమల్ ఇంకా స్ట్రైకింగ్ స్టైల్‌తో పునర్నిర్వచించారు**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965